# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

వెల : రూ. 10.00

జూన్ 2026



ఏప్రియల్ 1 నుండి 5 వరకు జరిగిన శ్రీ కాళహస్తి, శుకబ్రహ్మాశమ వ్యవస్థాపకులు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి వారి 28వ ఆరాధనోత్సవాలలో శ్రీ మాతాజీ









మార్చి 19 న ఉగాదినాడు శ్రీ కాశీవనాశ్రమంలో జరిగిన శ్రీ సద్గురు పాదపూజా దృశ్యములు

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ
సన్నిధానం కాళీమాత

సంపుటి 45 సంచిక 10
పేజీలు 44
జూన్ 2026

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed & Published by
Paluri Siva Rama Kali Prasad
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Nagendra Enterprises,
D.No.24-7-8, Sandeep Mansion
Jonnavittula Vari St.
Gandhi Nagar, Vijayawada
N.T.R. Dist., Andhra Pradesh.
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో ............................ పేజీ**

శ్రీ కాళీ ప్రసాద శతకము .................... ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట......................................... .................. 6
అర్థమనర్థం ........ ....... ...... ......... ......................................8
శుక మహర్షి...................................................10
భగవద్గీత సాధన దీపిక ..............................12
శ్రీ మాతాజీవారి విదేశీ పర్యటన..........15
స్వామి దయానంద మహరాజ్... ...................16
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్‌వారి సహస్ర నామావళిః ......... 18
శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ! 20
నారద భక్తి సూత్రములు ................ ................22
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు....24
దేవుడి స్క్రిప్ట్ .................................................25
మాయా విలాసం........................... .................27
గురోరంఘ్రి పద్మే మనస్చే న్నలగ్నం............29
వేస్తుంటే ఒక్కొక్క దండా మీ మెడనిండా..............................31
నిరీక్షణ ......................................................................32
శ్రీ గురుగీత .......................................... ........34
గురుకృప ........................................ .............36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
విష్ణు కథలు ...... ........................... ...................41

## శ్రీ కాళీ ప్రసాద శతకము - పాలూరి ప్రసాద్



13. వేషభాషల పరుల మోసంబుజేయ
నగును మరియసలు రంగు దాయ
నగునె సరి నీయంతరాత్మ యెదుట
కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥

తా: కొంతమంది మహాభక్తులలాగానో, సాధువులలాగానో వేషభాషలు ధరించి మనలను నమ్మిస్తూ ఉంటారు. వారి తీరు చూస్తే 'ముఖం పద్మదళాకారం, వర్చస్సు చందన శీతలం' అన్నట్టు ఉంటుంది. బయటకు ఇలా కనబడుతున్నా వారి మనస్సు మాత్రం కత్తులబోనులా ఉంటుంది. ఎప్పుడూ లోపల ఎవరికి ఏ అపకారం తలపెడదామా అని ఆలోచిస్తూ ఉంటుంది. అయితే నీ వేషభాషలతో బయటివారిని మోసం చేయగలవు కానీ నీ మనస్సుయొక్క అసలు రంగుని నీ అంతరాత్మ వద్ద దాచగలవా? అది ఎల్లప్పుడూ నిన్ను గమనిస్తూ, హెచ్చరిస్తూనే ఉంటుంది.

1) జగత్తు సత్యమా? అసత్యమా?
2) రుభు మహర్షి నాభాగునిపై ఎందుకు కూర్చున్నాడు?
3) లోకవ్యవహారాలన్నీ సాధనగా ఎప్పుడు మారుతాయి?
4) తుపాకీ దెబ్బకు గాయపడ్డ పులి ఎవరిని ఆశ్రయించింది?
5) శ్రీగురుదేవులు చేసే పరోపకారం ఏమిటి?
6) ఎంత పుచ్చుకున్నా ఎటువంటి హాని చేయనిది ఏది?
7) బ్రాహ్మణత్వం లోపిస్తే అతడు ఏమవుతాడు?
8) ఎవరి శరీరాన్ని తాకి పర్వతాలు పిండిపిండి అయ్యాయి?
9) నలనీలులకు శాపమిచ్చినది ఎవరు?

*సమాధానాలు లోపలి పేజీలలో ............................*

# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

7-11-1981

ఈరోజు రాత్రి శ్రీబాబు భక్తులకు దర్శనం యిచ్చారు. 'నిజమైన బ్రాహ్మణుడంటే ఎవరండీ మీరంతా చదువుకున్నవారు, పండితులు కదా! చెప్పండి? పుట్టుకతోనే ఎవడైనా బ్రాహ్మణుడవుతాడా? బ్రాహ్మణుడు అనేవాడు చేయవలసినది ఏమిటి? వాడు గాయత్రిని జపించాలి కదా! అలా ఎంతమంది చేస్తున్నారు? పోనీ అది అలా ఉంచండి. గాయత్రి మంత్రం ఏం తెలియజేస్తుందో చెప్పండి?"



అని ప్రశ్నించారు. శ్రీ బాబు మళ్ళీ మాట్లాడుతూ, రోహిదాసు అధమజాతిలో పుట్టాడు. కాని నిత్యమూ ఈశ్వరుని సేవించి ఆయన దర్శనభాగ్యము కూడా పొందినవాడు. అదే గ్రామంలో ప్రచండుడనే మహా పండితుడు ఉన్నాడు. అతడు బ్రాహ్మణ వంశంలో జన్మించాడు. కాని దైవదర్శనం పొందలేదు. అధమ జాతిలో జన్మించిన రోహిదాసుకు ఈశ్వరుని సేవించే అర్హత లేదని మహారాజుకు కూడా ఫిర్యాదు చేస్తాడు. ఈ ఇరువురిలో బ్రాహ్మణులు ఎవరు? మీరే ఆలోచించండి. బ్రాహ్మణత్వము ఎక్కడ లోపిస్తుందో అక్కడ బ్రహ్మత్వము ప్రకాశిస్తుంది. బ్రాహ్మణత్వము లోపిస్తే బ్రహ్మవేత్త అవుతాడు. అది స్టేజి ఎక్కి ఉపన్యాసాలు దంచటం కాదు. క్రియలో చూపించాలి' అన్నారు.

శ్రీ బాబు ఇంకా మాట్లాడుతూ 'గాయత్రీమంత్రం ఏమి తెలుపుతోంది? అన్ని కాలాలలోనూ గల సమస్త జీవరాశులలో ప్రకాశించే ఆత్మవస్తువు ఒక్కటేనని కదా! మరి గాయత్రి అందరూ జపించకూడదు అని ఏ శాస్త్రం అయినా చెప్పిందా? ఈ గోచిపాత రాయుళ్ళు చెప్పిందే కదా! గాయత్రి అనుగ్రహానికి పాత్రుడైన వాడు రోహిదాసుడా లేక ప్రచండ మహాపండితుడా? నేను ఇలా మాట్లాడతానని కోన్‌కిస్కా గోచిపాతర రాయుళ్ళంతా నామీద దుష్ప్రచారం చేశారు. వాళ్ళ సంగతి మా అమ్మ చూసుకుందనుకోండి' అన్నారు.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

## రామనామం వెరులై పారుతోంది రండి రండి త్రాగండి

“భగవన్నామం ఏ విధంగా, ఎక్కడ, ఎంత చేసినా తనివితీరదు. అది ఏ ఒక్కరి సొత్తో కాదు. అది అందరి సొత్తును. ఈ భగవన్నామ మనేది ఎందుకు చేసుకోవాలి అని కొందరికి సందేహం రావచ్చు. సుఖదుఃఖ భూయిష్టమైన మేనే ‘నేను’ అనే భ్రాంతిని వేరు చేసి, ఏ సుఖశాంతులకై మానవుడు పరుగులు పెడుతున్నాడో, అట్టి శాశ్వత ఆనందాన్ని పరిపూర్ణంగా ప్రసాదిస్తుంది ఈ భగవన్నామం. తన నిజ ఉనికిని మర్చిపోయిన మానవుడికి, దానిని గుర్తుకు తెచ్చేది భగవన్నామం. అది చేయగా చేయగా, ఆ భగవన్నామ స్వరూపం తానే అని తెలుసుకుని ఆనందాబ్ధిలో ఓలలాడుతాడు మానవుడు. అయితే మనసు వుంచి నామజపం చేయాలి. అప్పుడు మనస్సు భగవన్నామంలో లీనమైపోయి తదాకారాన్ని పొందుతుంది. అలా భగవన్నామాన్ని జపించిన వారిలో అగ్రగణ్యుడు మారుతి.



నేతి పెసరట్లు బాగున్నాయి కదా అని ఒక రెండు ఎక్కువ తింటే, దాని పరిణామమేమిటో అందరికీ తెలిసిందే. కానీ భగవన్నామం ఎంత పుచ్చుకున్నా ఎటువంటి హానీ చేయదు సరికదా, మనని మరింత తొందరగా మన నిజ గమ్యానికి చేరుస్తుంది. దానికి విలువ కట్టడం ఎవ్వరి తరమూ కాదు.

అటువంటి దివ్యనామం, మహాత్ముల సన్నిధిలోను, సజ్జన సాంగత్యంలోను దొరుకుతుంది. ఇటువంటి సత్సంగ సమావేశాలలో జాతి, కుల, మత భేదాలనే బంధాలని ఛేదించుకుని, చిన్నా, పెద్ద అనే తారతమ్యం వీడి, భగవన్నామం ఒక అమృతఝరిలా ప్రవహిస్తున్నది. దానిని గ్రోలేవారు, పుచ్చుకునేవారు, తీసుకుని పోయేవారు, పాడేవారు, వినేవారు రండి! రండి! అది ఒక పెద్ద మహా ప్రవాహం! మీరు చిన్నగ్లాసు తీసుకువెళితే అంతే వస్తుంది. పెద్ద బిందె, లేక ట్యాంకో అయితే, అంతే నింపుకోవచ్చు. అలా కాదు – ‘నేను అందులోనే మునిగిపోయి హాయిని పొందుతా’ నంటే అలాగే చేయవచ్చు! అందులో మునిగి ప్రాణాలు కోల్పోతామని భయపడ నక్కరలేదు. ఎందుకంటే భగవన్నామం మనకి అమృతత్వాన్ని ప్రసాదిస్తుంది గాని, ప్రాణహాని చేయదు. భగవన్నామంలోని నిజతత్వాన్ని అర్థం చేసుకోవాలంటే ముందు మీలోని గుణాలని రహితం చేసుకోవాలి. సహస్ర నామాలు, లక్షలు కోట్లు చదివాము

అనే లెక్కలు కాదు కావలసినది. ఆ లెక్కలలోంచి బయటకి వస్తేనే కదా ఆ భగవానుడు అందేది! ఏ ఒక్క నామం యందైన మనస్సు నిలచిపోవాలి. అప్పుడు లెక్క ఆగిపోతుంది. మనసును మరచి నామం చేయాలి. మేమలాగన్నామని, అయితే మమ్మల్ని పనులన్నీ మానేసి కూర్చుని నామం చేయమంటారా" అని అడుగుతారేమో! అలా ఎప్పుడూ, ఏ మహాత్ముడు అనలేదు. మీమీ పనులన్నీ చేసుకుంటూనే మనస్సుతో నిరంతరం భగవన్నామాన్ని స్మరించండి. అప్పుడు మీరు 'కర్మలో' 'అకర్మ'ని చూడగలుగుతారు.

ఎప్పుడో వృద్ధాప్యం వచ్చాక చేద్దామని అనుకోకండి. ఏ శ్వాస మన చివరి శ్వాసో తెలియదు. దీపముండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి. నిరంతర నామస్మరణ ద్వారా, ధ్యానాగ్ని ప్రజ్వరిల్లి మీలోని సమస్త కర్మలనూ దగ్ధం చేసి, మిమ్ము సచ్చిదానంద స్వరూపులుగా తీర్చిదిద్దుతుంది. అటువంటి సాధనకై కావలసిన అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ!"

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, గుంటూరు వాస్తవ్యులు అయిన శ్రీ పెనుమాక నాగేశ్వరరావు గారు 10-5-2026 ఆదివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 68 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## *పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు*

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**జూన్ 2026**

**10 బుధ: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ**

**29 సోమ: నిజ జ్యేష్ఠ పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ**

**జులై 2026**

**9 గురు: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ**

**25 శని: తొలి ఏకాదశి – శ్రీ సద్గురు పాదపూజ**

**29 బుధ: ఆషాఢ పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ**

# అర్థమనర్థం

(గత సంచిక తరువాయి)

- పాలూరి కాళీప్రసాద్

**వృద్ధస్తావచ్చింతాసక్తః** అని మళ్ళీ జగద్గురువులే ఇక్కడ చెబుతున్నారు. అంతేకాదు మనలో సరైన జన్మజన్మాంతర సంస్కారం లేకపోతే ఈ డబ్బు మనలో దాగివున్న దుష్ట గుణాలన్నింటినీ బయటకు తెస్తుంది. ఏనెలకానెల చాలీచాలని జీతంతో బ్రతికినన్నాళ్ళు మనిషి 'అందరూ నావాళ్ళే, మనకున్నది అందరితో పంచుకోవాలి' అనుకుంటాడు. ప్రేమ, ఆప్యాయతలు కురిపిస్తాడు. తాను వండుకున్న కాస్త అన్నమే మహాప్రసాదంగా మరునాటికి దాచుకొని మరీ తింటాడు. అదే వ్యక్తికి అనుకోకుండా ధనం వచ్చిపడితే ఇక తన చుట్టూ ఉన్న వాళ్ళందరూ శత్రువులుగానే కనిపించడం మొదలుపెడతారు. ప్రపంచమంతా తనను దోచుకోవడానికే కాచుకొని కూర్చున్నట్లు అనిపిస్తుంది. గొప్పలకోసమో, పుణ్యంకోసమో లక్షలు, కోట్లు అవలీలగా దానం ఇచ్చేసేవాడు కూడా తన ఇంట్లో ఒక చిన్న చెంచానో, ఒక గుడ్డముక్కో కనపడకుండా పోతే సతమతమైపోతాడు. పనిమనుషుల దగ్గరనుంచి కొడుకు, కోడలు వరకు ఎవరినైనా దొంగలని నిందించడానికి వెనుకాడడు. సొంత మనుషులంటే కూడా ఎందుకు ఇంత భయం వస్తోంది? అని విచారిస్తే తనలో జవసత్వాలు ఉన్నంతకాలం 'ఇది మనది' అనే భావన ఏమాత్రం లేకుండా 'ఇదంతా నాదే! నా ఇష్టం వచ్చినట్లు నేను వాడుకుంటాను' అని విచ్చలవిడిగా ప్రవర్తించి చివరికి భార్య, పిల్లలను కూడా సంప్రదించకుండా అహంకారంతో పెత్తనం చలాయిస్తాడు. తీరా వృద్ధాప్యంలో జవసత్వాలు ఉడిగి, జ్ఞాపకశక్తి నశించే సమయంలో తన బిడ్డలు కూడా తనలాగే 'ఇదంతా నాది' అని ఎక్కడ లాక్కుంటారో, తన అధికారం ఎక్కడ పోతుందో అన్న భయం వెంటాడటం మొదలవుతుంది.

అదే ముందునుంచి 'ఇది నాకు భగవంతుడు ఇచ్చిన ప్రసాదం. అలాగే ఈ కుటుంబం కూడా నాకు ఆయన ప్రసాదమే' అని భావిస్తూ 'ఇదంతా మనది' అనే భావన చూపిస్తూ, ప్రతి విషయం భార్య, పిల్లలతో సంప్రదించి చేసే అలవాటు ఉన్నవాడు వాడి పిల్లలలో కూడా అటువంటి సంస్కారాన్నే కలిగిస్తాడు. అప్పుడు వారు తననుంచి లాక్కుంటారనే భయం కలగదు కదా! 'ఇది నాది, దీనిమీద సర్వ హక్కులు నాకే కావాలి' అనుకున్న దుర్యోధనుడు రాజభవనంలో ఉన్నా నిరంతర చింతలోనే బ్రతికాడు. 'ఇది మనది, అందరూ మనవాళ్ళే' అనుకున్న పాండవులు అడవులలో ఉన్నా ప్రశాంతంగా జీవించారు.

అందుకే జగద్గురువులు మళ్ళీ **మూఢ జహీహి ధనాగమతృష్ణాం కురు సద్బుద్ధిం మనసి వితృష్ణామ్। యల్లభసే నిజకర్మోపాత్తం విత్తం తేన వినోదయ చిత్తమ్॥** అని ధనాన్ని ఎలా చూడాలో నేర్పిస్తున్నారు. ఓ మూఢుడా 'నాకు ఇంకా ఇంకా ధనం కావాలి' అనే దాహాన్ని విడిచిపెట్టు. సద్బుద్ధి కలవాడివై ధనదాహాన్ని వదిలి నీ కర్మ ఫలితంగా ఎంత ధనమైతే వస్తోందో దానితోనే నీ సంసారాన్ని గడుపుకుంటూ హాయిగా, ప్రశాంతంగా జీవించు అని బోధిస్తున్నారు.

మరి ఇక్కడ మనిషికి ఇంకా ఎదగాలి అని ఆశయం ఉండటం తప్పు ఎలా అవుతుంది? అనే ప్రశ్న వస్తుంది. అయితే మనం ఎదుగుదలని డబ్బుతోనే కొలవడం అలవాటు చేసుకున్నాం. ఈరోజు ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు అని పేరు తెచ్చుకున్నవాడు రేపు కూడా అలాగే ఉంటాడని భరోసా ఎక్కడిది? వీడిని చూసి ఇంకొకడు వీడికన్నా ఎక్కువగా ఎదుగుతాడు. ఇది ఒక అంతులేని పరుగుపందెం. మళ్ళీ ఇక్కడ జగద్గురువులు ఈ పరుగుపందెం గురించి **యావద్విత్తోపార్జనశక్తః తావన్నిజపరివారో రక్తః। పశ్చాజ్జీవతి జర్జరదేహే వార్తాం కోఽపి న పృచ్ఛతి గేహే॥** అని చెప్తున్నారు. పైన చెప్పినట్లుగా కుటుంబంలో అప్యాయతలను, సమష్టి భావనను వదిలివేసి 'నా చేతిలో డబ్బు ఉన్నంతకాలం నేనే రాజుని' అని విర్రవీగుతూ డబ్బు వెనుక పరుగెట్టేవాడిని కుటుంబసభ్యులు కూడా అంతవరకే గౌరవిస్తారు. ఒక్కసారి సంపాదన ఆగిపోయిందంటే కనీసం 'బాగున్నావా? తిన్నావా?' అని అడిగేవాడు కూడా ఉండడు. ఇంక వాడు ఏమి సాధించినట్లు?

ఈ పరుగులలో పడి అసలు మన లక్ష్యం ఏమిటి, మన జీవితం ఎందుకు వచ్చింది అనే విషయాన్నే మర్చిపోతున్నాం. ఎంత సంపాదించినా చివరికి వట్టి చేతులతో మట్టిపాలు కావలసిందే కానీ ఇక్కడినుండి పరలోకానికి ఒక్కపైసా తీసుకెళ్ళినవాడు ఎవడూ లేడు. ఒకవేళ తీసుకెళ్ళినా అది అక్కడ చెల్లదు. అందుకే జగద్గురువులు మళ్ళీ **మా కురు ధన-జన-యౌవన-గర్వం హరతి నిమేషాత్కాలః సర్వమ్। మాయామయమిదం అఖిలం హిత్వా బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా॥** అని చెబుతున్నారు. 'నాకు ఇంత ధనం ఉంది. నా వెనకాల ఇంత బలగం ఉంది. నాకు యవ్వనం ఉంది. ఏదైనా అవలీలగా చేసేయగలను' అని విర్రవీగకు. ఇవన్నీ ఒక్కనిమిషంలో కాలం హరించివేస్తుంది. ఇదంతా మాయ అని తెలుసుకొని నీ స్వస్వరూప స్థితి అయిన బ్రహ్మపదాన్ని చేరుకోవడానికి ప్రయత్నించమని బోధిస్తున్నారు.

- సశేషం

# శుక మహర్షి

- సన్నిధానం కాళీమాత

దేవీ భాగవతం ప్రకారం శ్రీ వ్యాస మహర్షికి, ఘృతాచి అనే చిలుక రూపంలో వున్న అప్సరసను మోహించడం వలన జన్మించాడు శుకుడు. శుకం అంటే చిలుక. అందుకే పురాణాలలో శుకుడు చిలుక రూపంలో వున్నట్లుగానే చెబుతారు. ఆయన అలానే తిరుగుతూ వుంటారు అని చెబుతారు. కాని ఆయనను ఆరాధించే వారిని పరీక్షించి, మానవ రూపంలో దర్శనం ఇచ్చినట్లుగా కూడా పురాణాలలో వుంటుంది.

కేవలం మోక్షాపేక్ష కలిగిన వారికి శుకుని చరిత్ర ఆదర్శప్రాయంగా వుంటుంది. వ్యాసమహర్షి శిష్యులైన సుమంతుడు, పైలుడు మొదలైన వారంతా వయస్సులో శుకుని కంటే చాలా పెద్దవాళ్ళు. అయినా శుకుడు వాళ్ళతోపాటు సమంగా ఆశ్రమంలో వేదాలను అధ్యయనం చేసేవాడు. శిష్యులందరూ తమకు ఇవ్వబడిన యజుర్వేద, సామ, అధర్వణ, పురాణ ఇతిహాసములు అన్నీ ప్రచారం చేయడానికి వెళ్ళిపోయారు. శుకుడు మాత్రం ఆశ్రమంలోనే వుండిపోయాడు.

నారద మహర్షి ఒకసారి వ్యాస ఆశ్రమానికి వచ్చాడు. అతడు వ్యాసునితో 'మీ ఆశ్రమంలో వేద ఘోష వినబడటం లేదేమిటి?' అని అడిగాడు. తండ్రీ కొడుకులిద్దరూ ధ్యానంలో వుంటారు. వారు మౌనులే. అయినా ఆశ్రమంలో వేద ఘోష వుండకపోవటం దోషం కదా!' అనగా క్షణమాత్రంలో వారిద్దరూ వేదాలను తమలోపలి నుండి బహిర్గతం చేసి, త్రిలోకాలు వినబడేటట్లుగా ఒక్కసారిగా వేదనాదాన్ని సృష్టించారు. నారద మహర్షి ఎంతో సంతోషించాడు.

ఈ లోకంలో జన్మించిన వారికి హితమైన మార్గాన్ని ఉపదేశించమని నారద మహర్షిని అడిగాడు శుకుడు. దానికి సమాధానంగా నారద మహర్షి 'నాయనా! పూర్వం మహర్షులు సనత్కుమారుణ్ణి ఇదే విధంగా ప్రశ్నించారు. వారికి ఆయన ఇచ్చిన సమాధానమే నేను నీకు వివరిస్తాను.

'తపస్సు, సత్యము, విద్య ఇవి అన్నీ పరమ సుఖాన్ని ఇచ్చేవి. కాని తపస్సు వుండి, సత్యవ్రతము వుండి, విద్యకూడా సంపాదించి, ముక్తి యందు కోరిక లేకపోతే ఇక అతడు ముక్తి పొందలేడు. ఈ విజ్ఞానం అంతా అనగా వేదవేదాంగములు చదవడం, యజ్ఞయాగాది క్రతువులు చేయడం, సత్యము నందు జ్ఞానము, శౌచము ఇవి అన్నీ వుండి కూడా ముక్తియందు కోరిక లేకపోతే అది ఎన్ని జన్మలైనా పొందగలగటం సాధ్యం కాదు. ఇన్నీ వున్నా జీవుడికి ముక్తి యందు తీవ్ర ఇచ్ఛ వుంచుకోవలసిన బాధ్యత వుంటుంది. అయితే ఇంత జ్ఞానము, తపస్సు వున్నవారు ముక్తి కాంక్షతో కాక, మరే ఇతర కారణాలతో తపస్సు ఆచరిస్తారన్న సందేహం కలుగవచ్చు. తపస్సులు అనేక కారణాలతో చేస్తారు. కోరికలతో, అహంకారంతో, దుఃఖంతో, క్రోధంతో తపస్సు చేస్తారు.

ఏ కారణంతో తపస్సు చేసినా, వారు తేజస్సును ఇనుమడింపజేసుకోవచ్చు. వేదవేదాంగాలు చదివి విద్యను అభ్యసించవచ్చు, శౌచవిధానము పాటించవచ్చు. కానీ, మోక్షకాంక్ష లేకపోతే?

అయితే ముక్తియందు అభిలాష వున్నవారికి ఇవి తప్పనిసరి అని సనత్కుమారుడు వివరించాడు. మోక్షగామి అయినవాడు, కామక్రోధాలు జయించాలి. అపరిగ్రహం, అహింస, ఇంద్రియ జయంతోపాటు సర్వారంభ పరిత్యాగం వుండి ముక్తిని కోరితే అప్పుడు ముక్తి కరతలామలకం అవుతుంది. సంకల్ప వర్జనం చేత ధర్మం, అహింస వలన అధర్మం రెండూ నశించాలి. మోక్షం పొందాలంటే ధర్మాధర్మలు రెండూ వుండరాదు. ముందు సర్వారంభపరిత్యాగి అయి సంకల్ప రహితుడు కావాలి.

ధర్మం అనేది సుఖప్రదమైనది, క్షేమకరమైనది. కానీ, మోక్షసాధనలో భౌతిక, లౌకిక క్షేమం కూడా విసర్జించాలి. సత్యాసత్యాలు రెండూ విడవాలి. సర్వదేహ సంపత్తి, సత్యాసత్యాలు ప్రారంభ దశలో వుంటాయి. అంతమునందు పదివేల శోకభయ హేతువులు కనబడినా చలించకుండా వుండాలి. ప్రపంచంలో తన చుట్టూ ఎన్ని సంఘటనలు జరుగుతున్నా, నిస్పృహతో వుండి ముక్తి హేతువును మాత్రమే అన్వేషించాలి. అటువంటి వారికే ముక్తి లభిస్తుంది' అని సనత్కుమారుని వచనములను నారదుడు శ్రీ శుకునికి తెలియజేశాడు.

నారదుడు చెప్పిన విద్యలన్నీ శుకుడు సంపాదించాడు. తపస్సు, శౌచము కూడా అతనికి వున్నాయి కనుక తండ్రి దగ్గరకు వెళ్ళి, ప్రదక్షిణ చేసి, ముక్తి కొరకు యోగసిద్ధిని పొందుతాను, అనుజ్ఞ ఇవ్వమని అడిగి, అనుమతిని పొంది, మరి ఎక్కడా నిలువక వెళ్ళిపోయాడు.

అలా ఆయన నియుక్త ప్రదేశంలో ప్రాఙ్ముఖ ఆశీనుడై సిద్ధచారులచే సేవించబడి కైలాస శిఖరానికి వెళ్ళి, గొప్ప యోగమందు ప్రవేశించి, తపస్సు చేశాడు. నారదుడు ఆయనను చూడటానికి వస్తే, అక్కడ నుండి అంతర్ధానమై, మళ్ళీ సంచారియై, త్రిగుణములను వదిలి, ఉత్తరాభిముఖంగా ప్రయాణించాడు. దారిలో మహా పర్వత శృంగములు శుకుని మార్గానికి అడ్డంగా వచ్చాయి. ఆయన అలా నిస్పృహగా వెళ్ళిపోగా, ఆయన శరీరానికి తగిలి ఆ పర్వతములు పిండి పిండిగా అయ్యాయి. ఆయన వాయు మార్గంలో ఆకాశాన్ని, అంతరిక్షాన్ని దాటి వెళ్ళిపోసాగాడు. సిద్ధులు చారణులు ఆయనకు దారి యిచ్చి ప్రక్కకు తప్పుకుంటున్నారు. ఆయన యోగమార్గావలంబియై, పరబ్రహ్మ స్వరూపుడై భవ్యఖ్యాతిని ఆర్జించాడు. ఇది శుకుని చరిత్ర. ఆయన చిరంజీవి. నేటికీ వున్నాడని చెబుతారు. ఆ మహాముని చరిత్ర పవిత్ర స్మరణము, భవ భయ నాశకరము. ఇహపర సాధనము.

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

**16. నాసతో విద్య తే భావో నాభావో విద్యతే సతః**

**ఉభయోరపి దృష్టోఽ న్తస్త్వనయోస్తత్వ దర్శిభిః ॥**

శ్రీకృష్ణ భగవానుడు “అర్జునా! అసత్తుకు సత్తుగాని, సత్తుకు అసత్తుగాని లేదు. లేని వస్తువుకు త్రికాలములలో ఏకాలంలోనూ నిజంగా ఉనికి అనేది ఉండటానికి వీలులేదు. అలాగే ఉన్న వస్తువు లేకుండా పోవటం అసంభవం” అని చెప్పాడు.



ఆత్మ సత్తు, దేహం అసత్తు అని తత్త్వవేత్తలు మాత్రమే తెలుసుకుంటారు. సదసద్వివేకము అట్టి వారికి మాత్రమే ఉంటుంది. సత్యము ఇంత సూటిగా, సరళంగా, సులభంగా ఉండేదయినా, దీనిని యథార్థముగా గ్రహించగలవారు కొద్దిమంది మాత్రమే ఉంటారు. ఆత్మ, అనాత్మలను గురించిన వివేకము, నిత్యానిత్య వివేచనము వాళ్ళకే ఉంటాయి. ఈ అంతరం ప్రత్యక్షంగా కనిపిస్తూ వున్నా, అది సూక్ష్మమైనది కావటంవలన, సంసారంలో మునిగి తేలుతూ వుండే జీవులు దానిని తెలుసుకోలేరు. కేవలం తత్త్వదర్శినులకు మాత్రమే ఈ అంతరం గోచరిస్తుంది. ఉన్న వస్తువు అయిన సచ్చిదానందం ఏదైతే వున్నదో అదే శాశ్వతమైనది అని తెలుసుకోవటమే తత్త్వదర్శనం. ఋషులు, ద్రష్టలు, తత్త్వదర్శినులు మాత్రమే సత్తుకు నాశనము అనేది లేదు అని తెలుసుకుంటారు. అలాగే అసత్తులో సత్తు ఎన్నడూ ఉండలేదు అన్న ఎఱుక కలిగి ఉంటారు.

జగత్తు కేవలం జగత్తు మాత్రమే కాదు. అది అసత్తు కూడా. మారిపోతూ ఉన్న జగత్తు వలె భాసించే సత్త్వదార్థం ఏదైతే ఉన్నదో, ఆ సత్యవస్తువు ఎన్నడూ ఏ మార్పుకూ గురి కావటం లేదు. అయినా అందరూ నిజము అని భ్రమించేటట్లుగా కనిపించే, అనుక్షణము మారిపోతూ వున్న, ఈ జగత్తుగా భాసిస్తున్నది. జ్ఞానులు దీనిని బ్రహ్మవివర్తము అని భావిస్తే, భక్తులు దీనినే బ్రహ్మలీల అని

కొనియాడుతున్నారు. సచ్చిదానందము మార్పులేనిది. సచ్చిదానందానికి జగత్తుగా భాసించే శక్తి ఉన్నది.

ఎడారిలో నీళ్ళు లేకపోయినా లేడికి అక్కడ నిజంగా నీరు వున్నట్లు కనిపిస్తుంది. ఒక్కొక్కప్పుడు ఆ నీళ్ళతో దాహం తీర్చుకోవటం కోసం మృగతృష్ణ వెంట పరిగెత్తి, పరిగెత్తి లేళ్ళు ప్రాణాలు పోగొట్టు కుంటాయి. గ్రుడ్డి వెలుతురులో, అస్పష్టంగా వంకరటింకరగా వున్న ఆకారాన్ని చూడగానే నీకు అది పాము అని వెంటనే తెలిసిపోతుంది. అప్పుడు నీవు భయపడటమో, లేదా ఆ పామును చంపటానికి ప్రయత్నించటమో చేస్తావు. అంతలో ఎవరో దీపం తెచ్చి చూస్తే, అప్పుడు తీరా అక్కడ వున్నది సర్పము కాదని, రజ్జువు అని తెలుస్తుంది. నీవు భయపడినప్పుడూ, లేదా దాన్ని చంపాలని ప్రయత్నిస్తున్నప్పుడూ కూడా అక్కడ సర్పము అన్నది లేనేలేదు. ఉన్నది రజ్జువు మాత్రమే. మరి సర్పము లేదా? సర్పము లేకపోతే పాము వున్నది అని నీవు ఎలా అనుకున్నావు? అక్కడ నిజంగా పాము వుంటే నీవు ఎలా ప్రవర్తించేవాడివో, సరిగ్గా అలాగే ఎందుకు ప్రవర్తించావో విచారణ చేస్తే, అప్పుడు నీకు రజ్జువుకు సర్పంగా భాసించే శక్తి వున్నది అని తెలుస్తుంది. అలాగే బ్రహ్మమునకు జగత్తుగా భాసించే శక్తి వున్నది. ఈ జగత్తు అందువల్లనే అసత్తు అనబడుతున్నది. అసత్తు అంటే కేవలం శూన్యంకాదు. జగత్తు శూన్యంలో నుండి వచ్చి శూన్యంలో కలిసిపోవటం లేదు. అది బ్రహ్మము యొక్క ఆభాస తప్ప వేరుకాదు. నీవు నీ అజ్ఞానాంధకారం వల్ల నిజాన్ని గ్రహించ లేకపోతున్నావు. అక్కడ నిజమైన సర్పమూ లేదు, మాయా సర్పమూ లేదు. ఉన్నది రజ్జువు మాత్రమే. అదే సర్పముగా భాసిస్తున్నది. ఆ సర్పాన్ని నీవు సత్యం అనుకొంటున్నావు. స్వామి తురీయానంద అందుకే "బ్రహ్మ సత్యం, జగత్ బ్రహ్మ" అన్నాడు.

నిజానికి జగత్తు లేనే లేదు. బ్రహ్మమే జగత్తుగా కనిపిస్తున్నది. నీవు ఈ రోజున ఈ సత్యాన్ని దర్శించలేకపోవచ్చు. కాని మన ప్రాచీన ఋషులు, ద్రష్టలు దర్శించిన ఈ సత్యములో విశ్వాసం కలిగి వుండు. నీలో ఏ భావవికారాలు, సంచలనాలు చెలరేగుతున్నా సరే, నీవు మాత్రం తత్త్వదర్శనులైన వారు చెప్పిన దానియందు దృఢమైన విశ్వాసంతో స్థిరంగా నిలబడు. వ్యక్తులు, విషయాలు, సన్నివేశాలు, ఎన్నో అనుభవాలు,

మరెన్నో, చిత్తవృత్తులు---ఎన్నింటి అనుభవం నీకు కలుగుతున్నట్లుగా వున్నా సరే, ఇవన్నీ బ్రహ్మము యొక్క నామ రూపాదికము మాత్రమే అన్న అచంచలమైన విశ్వాసాన్ని కలిగి వుండు. ఈ విశ్వాసాన్నే ధ్యానించు. జగత్తు మాయ అంటే అక్కడ మాయా ప్రపంచం ఏదో వున్నదని కాదు. నీవు నిజానికి బ్రహ్మమునే చూస్తున్నావు. కాని నీవు పొరపడిన దృష్టితో చూస్తున్నందున అక్కడ నీకు బ్రహ్మము బదులుగా మాయా ప్రపంచం కనపడుతున్నది. లేడి మృగతృష్ణలోని ఇసుకను నీరుగా ఎలా భావిస్తుందో, నీవు బ్రహ్మమును జగత్తుగా అలాగే భావిస్తున్నావు. బ్రహ్మము తాను మారకుండా, ఏ విధమైన వికారం చెందకుండా, జగత్తుగా భాసిస్తుంది. బ్రహ్మమునకు ఆ శక్తి ఉన్నది అన్న సంగతి నీవు సర్వకాల సర్వావస్థలలోనూ గుర్తు ఉంచుకో.

- సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమవాసులు అయిన శ్రీమతి మావులేటి ప్రేమలత (గయ) గారు 13-5-2026 బుధవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 79 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్ శాఖ వారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

**జూన్ 2026**

**10 బుధ: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**29 సోమ: నిజ జ్యేష్ఠ పూర్ణిమ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**జూలై 2026**

**9 గురు: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**25 శని: తొలి ఏకాదశి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**29 బుధ: ఆషాఢ పూర్ణిమ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

## శ్రీ మాతాజీవారి అమెరికా పర్యటన వివరములు

శ్రీమాతాజీవారు జూన్ 1, 2026 నుండి జులై 6, 2026 వరకు అమెరికాలోని వివిధ ప్రదేశములు పర్యటిస్తారు. ప్రతి సంవత్సరము అమెరికాలో జరుపబడే వార్షిక త్రయాహ్నిక దీక్ష , సత్సంగము జులై 2 నుండి 5 వరకు ఫోర్ట్‌మిల్ సౌత్ కెరలినాలో జరుగును. వివరములకు క్రింద ఇవ్వబడిన **QR code** ను స్కాన్ చేసుకొనవలెను. అమెరికా పర్యటన వివరములకు సంప్రదించవలసిన వారి పేరు,ఫోన్ నంబరు:

అమెరికా : శ్రీ తనకెళ్ళ కాళీప్రసాదు :
**+1 (317) 459-2335,**
**ఇండియా : శ్రీ మురళీ మోహన వర్మ :**
**093983 34345,**
**09393834345.**

https://mathaji-babuji .org/2026%20US...

## శ్రీ మాతాజీవారి యునైటెడ్ కింగ్‌డమ్ పర్యటన వివరములు

శ్రీమాతాజీవారు జులై 7, 2026 నుండి జులై 21, 2026 వరకు యునైటెడ్ కింగ్‌డమ్ లోని వివిధ ప్రదేశములు పర్యటిస్తారు. ప్రతి సంవత్సరము యు.కె.లో జరుపబడే వార్షిక త్రయాహ్నిక దీక్ష, సత్సంగము జులై 10 నుండి 12 వరకు రీడింగ్‌లో జరుగును. వివరములకు క్రింద ఇవ్వబడిన **QR code** ను స్కాన్ చేసుకొనవలెను. పర్యటన వివరములకు సంప్రదించవలసిన వారి పేరు, ఫోన్ నంబరు:

యునైటెడ్ కింగ్‌డమ్ : శ్రీ తేజ గారు
0044-7805022588
**ఇండియా : శ్రీ మురళీ మోహన వర్మ :**
**093983 34345**
**09393834345**

https://mathaji-babuji .org/2026_SriMataj...

# స్వామి దయానంద మహరాజ్

(గత సంచిక తరువాయి) సేకరణ - మురళి

స్వామీజీ ప్రేరణ, మార్గదర్శకత్వం వల్లనే ఆయన శిష్యులు ఎంతో శ్రమతో పుస్తకాలు ప్రచురించి పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టగలిగారు. ఈ పుస్తకాలను వారు విద్యార్జన, ధ్యానం కోసం ఉచితంగా అందించారు. అవి ఒక నిజమైన సన్యాసి జీవితం ఎలా ఉండాలో భౌతిక కోరికలకు అతీతంగా జీవిస్తూ, మానవ రూపంలో పరమాత్మను సాక్షాత్కరించే జీవనలక్ష్యాన్ని నిబద్ధతతో కొనసాగిస్తూ, భక్తులను ముక్తి (శాశ్వత విమోచన) పథంలో నడిపించే విధంగా సాగించడాన్ని తెలియజేస్తాయి.

స్వామీజీ యొక్క తాంత్రిక సిద్ధులు గురించి వర్ణిస్తూ, స్వామి స్వయంభూ స్వరూప్ ఇలా చెబుతారు:

ఉత్తరాఖండ్‌లోని హర్షిల్ వద్ద పవిత్ర గంగా నదిపై ఒక రోప్ బ్రిడ్జ్ (తాడు వంతెన) ఉండేది. అక్కడి ప్రజలు ఆ వంతెన ద్వారా నదిని దాటి వెళ్ళేవారు. ఓరోజు, స్వామీజీ స్వయంభూకు ఉత్తరకాశీకి తిరిగి వెళ్ళమని చెప్పారు. తరువాత, తన సంచిని తనే మోస్తూ, తన పాదాలకు చెక్క పాదుకలు ధరించి, స్వామీజీ గంగా నదిపై నడిచారు అది రోడ్డు మీద నడవటంలాగా కనిపించింది! ఈ ఘట్టం చూసిన స్వామి స్వయంభూ పూర్తిగా అవాక్కయ్యారు. ఇది ఒక అతి దుర్లభమైన తాంత్రిక విద్య అని అంగీకరించారు. నది దాటి వెంటనే స్వామి దయానందజీ తన పాదుకలను ఒక రాయితో బద్దలు కొట్టి గంగానదిలో వేసేశారు.

ఈ సంఘటన స్వామీజీ యొక్క తాంత్రిక విజ్ఞానం అత్యున్నత స్థాయిలో ఉన్నదని తెలియజేస్తుంది. ఆయనకు ఆ జ్ఞానాన్ని భౌతిక ప్రయోజనాల కోసం ఉపయోగించాలనే ఉద్దేశం ఉండేది కాదు. పూజ్య స్వామి దయానంద గిరిజీ, ఎలాంటి స్వార్థం లేకుండా, తాంత్రిక శక్తిని కూడా మానవ సాధన కోసం వాడే ప్రయత్నం చేయలేదు. ఈ సంఘటన తర్వాత, స్వామి స్వయంభూ స్వరూప్ గారు, జీవితాంతం స్వామీజీతో మానసికంగా మరియు ఆధ్యాత్మికంగా బంధించబడ్డారు. ఇది ఇద్దరికీ ఆశీర్వాదంగా, ఆధ్యాత్మికంగా పరిపక్వతకు దోహదపడింది. స్వామీజీ తాను చేసే బోధనల మధ్యలో, స్వామి స్వయంభూకు మరియు ఇతర సన్యాసులకు కూడా ఆధ్యాత్మిక అంశాల లోతైన అవగాహనను ఇచ్చేవారు.

అంతటి ఉన్నత స్థాయిలో జ్ఞానం సంపాదించినప్పటికీ, స్వామీజీకి గర్వం లేదు, అహంకారం లేదు. ఎవరైన భక్తులు, సన్యాసులు ఏవైనా సందేహాలు లేదా ప్రశ్నలతో రావడం జరిగితే, స్వామీజీ ఎంతో వినయంగా సమాధానమిచ్చేవారు. స్వామి స్వయంభూ స్వరూప్, స్వామీజీ జీవిత చరిత్రను సేకరించి ప్రచురించడంలో (హిందీ) కీలక పాత్ర పోషించారు.

సంక్షిప్తంగా చెప్పాలంటే, ఈ భౌతిక లోకం లోకవికారాలలో చిక్కుకుని బాధపడుతున్న సమయంలో, స్వామి దయానంద గిరిజీని పరమాత్మ స్వయంగా ఒక మానవ రూపంగా పంపాడు. ఆయనలో ఎలాంటి మమకారం, కోరిక, కోపం లేకుండా నిస్వార్థంగా, పరమాత్మను తెలుసుకునే మార్గాన్ని భక్తులకు చూపించే మానవ దేవునిగా ఆయన ఉన్నారు. ఆయన విద్యను, జ్ఞానాన్ని, జీవిత తత్వాన్ని వేలాది భక్తులకు అందించి, మోక్ష మార్గం వైపు దారితీశారు.

కొంతకాలం స్వల్ప అనారోగ్యంతో బాధపడిన తర్వాత, పూజ్య స్వామి దయానంద గిరిజీ, 23 నవంబర్ 2004న బ్రహ్మ ముహూర్తంలో ఉదయం 4 గంటలకు చండీగఢ్‌లో పరమపదానికి చేరుకున్నారు. ఆయన అంతిమ కోరిక ప్రకారం, ఆయన భౌతిక దేహాన్ని హరిద్వార్‌కు తీసుకెళ్ళి, గంగా నదిలోని నీలధార వద్ద 24 నవంబర్ 2004న జలసమాధికి సమర్పించారు. ఆ సమయానికి, స్వామీజీ యొక్క మిత్రుడు, సహచరుడు మరియు ఆధ్యాత్మిక సహయాత్రికుడు, హరిద్వార్ లోని ప్రతిష్టాత్మక సాధనాసదన్ ఆశ్రమానికి మహామండలేశ్వరుడు అయిన స్వామి గణేశానందజీ మహారాజ్ తన శిష్యులతో కలిసి అక్కడికి వచ్చి, పూజ్య స్వామిజీకి నివాళులు అర్పించారు.

స్వామీజీని జీవితాంతం అనుసరించిన వేలాది మంది భక్తులు మరియు ఆయన్ను నేరుగా చూడలేకపోయినా, ఆయన బోధనలు ద్వారా ఆయనను గుర్తించగలిగిన వారు, ఆయన్ని ఎప్పటికీ పవిత్ర ఆత్మగా, పరమాత్మ పంపిన సందేశదాతగా గుర్తుపెట్టుకుంటారు. జై జై దయానంద గురూజీ మహరాజ్ కీ జై.

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి) -పాలూరి ప్రసాద్

**140. ఓం ప్రశాంతాయ నమః**

శ్రీ గురుదేవులు ప్రశాంతమైన మనసు కలవారు. ధ్యానాగ్ని చేత ఎవరి సంకల్పాలు, కోరికలు, అహంకార మమకారాలు దహించబడతాయో అట్టివారి మనస్సు ఎల్లప్పుడూ ప్రశాంతంగానే ఉంటుంది. అంతే కాక అట్టి శ్రీగురుదేవుల ప్రశాంత వదనాన్ని దర్శించిన భక్తులయొక్క మనో వ్యధలు ఉపశమించి వారికి కూడా అంతులేని ప్రశాంతత కలుగుతుంది.

**141. ఓం ధీనిధయే నమః**

ధీ అనగా బుద్ధి-ఏ బుద్ధి అయితే నిత్యా నిత్య వస్తు వివేకము కలిగి, అనిత్యమైన ప్రపంచమునందు విరాగము కలిగి, నిత్యమైన ఆ పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకొని, ఎల్లప్పుడూ ఆ ఆత్మానందంలో లీనమై ఉంటుందో అట్టి బుద్ధికి నిధి శ్రీగురుదేవులు. తమను ఆశ్రయించిన వారికి కూడ అట్టి బుద్ధిని ప్రసాదించి తరింపచేయగల సమర్థ సద్గురు దేవులకు నమస్కరించుచున్నాను.

**142. ఓం దీన వత్సలాయ నమః**

శ్రీగురుదేవులు దీనులైన జీవులను తల్లివలె చేరదీసి, వారి బాధలను తొలగించి, తండ్రి వలె వారిని అనుక్షణం వెంట ఉండి కాపాడి, చంచలమైన వారి మనస్సులను ప్రాపంచిక విషవలయం నుండి మరల్చి, పరమాత్మ వస్తువుయందు ఆసక్తిని, అనురక్తిని కలిగించి, వారి సాధనలో తోడుగా నిలచి వారిని తరింపచేయు దయార్ద్ర హృదయులు.

**143. ఓం భక్త లోక పరిత్రాణాయ నమః**

శ్రీగురుదేవులు తమను ఆశ్రయించిన భక్త లోకమునకు అభయమిచ్చి, వారిని చేరదీసి, వారిని జనన మరణ విష వలయమైన సంసార చక్రము నుండి విడిపించి ముక్తిని ప్రసాదించే పరబ్రహ్మ స్వరూపులు. వారిని ఆశ్రయించిన మానవులకే కాక వారి దర్శన, స్పర్శన, సామీప్య నివాస భాగ్యమునకు నోచుకొన్న సమస్త ప్రాణులను, పశు పక్ష్యాదులను సైతం అనుగ్రహించి మోక్షాన్ని ప్రసాదించే అద్వైత సామ్రాజ్య చక్రవర్తి శ్రీగురుదేవులు.

**144. ఓం యుక్తా యుక్త విలోకనాయ నమః**

శ్రీ గురుదేవులు తమ శిష్యులకు వారి సాధన మార్గములో ఏది యుక్తమైనదో ఏది అయుక్తమైనదో గ్రహించి వారికి ఏ సమయానికి యుక్తమైన వాటిని ఆ సమయానికి ప్రసాదించి, వారికి అయుక్తమైన వాటిని దరిచేరనీయక కాపు కాసే దివ్య నేత్రములు కలవారు.

**145. ఓం శక్తి యుక్తాయ నమః**

శ్రీ గురుదేవులు సర్వ శక్తిమంతులు. ఈ లోకంలోని సమస్త జీవరాశులలో పిపీలికాది బ్రహ్మ పర్యంతం నిండి ఉండి వారిని నడిపించే ఏ చైతన్యమైతే ఉందో ఆ చైతన్యమే శ్రీగురుదేవులు. వారి శక్తిలేనిదే ఈ ప్రపంచంలో ఏదీ జరుగదు. ఒక్కసారి వారి శక్తిని ఉపసంహరించుకొంటే ఎంతో శక్తివంతులమని, తెలివి గలవారమని విర్రవీగే జనులు సైతం నిర్వీర్యులై చేష్టలుడిగిపోతారు. ఈ ప్రపంచంలో ఏవైతే గొప్పగా, అందంగా, తెలివిగా, వైభవంగా, ఐశ్వర్యంతో కూడుకొని ఉన్నవో అవన్నీ శ్రీగురుదేవుల యొక్క శక్తి చేతనే ప్రకాశించుచున్నవి.

**146. ఓం పరాశక్తి స్వరూపాయ నమః**

ఈ విశ్వానికి కారణభూతమై, సృష్టి, స్థితి, లయములు నిర్వహించే త్రిమూర్తులను సృజియించి, వారికి తమ బాధ్యతా నిర్వహణకై శక్తిని ప్రసాదించి, ప్రపంచమంతటినీ తన కనుసన్నలలో నడిపించే ఏ ఆది పరాశక్తి ఉన్నదో ఆ పరాశక్తి స్వరూపులే శ్రీగురుదేవులు.

**147. ఓం సాధు సత్తమాయ నమః**

శ్రీ గురుదేవులు సాధువులందరిలోకి ఉత్తములు. వారు పరమ సాధు స్వభావులు. ఈ జగత్తంతా వారి సంతానమే కనుక వారు అందరిపై అపార కరుణను వర్షింపచేస్తారు. ఈ పాంచభౌతికమైన దేహాన్ని ఇచ్చిన తల్లిదండ్రులు కూడ తమ పిల్లల పట్ల కోపాన్ని పొందవచ్చునేమోగాని శ్రీగురుదేవులు మాత్రం తమచే సృష్టింపబడిన ఈ చరాచర జీవరాశి యందు ఎల్లప్పుడూ కరుణ రసాన్నే కురిపిస్తారు.

**148. ఓం పరోపకార పారీణాయ నమః**

శ్రీ గురుదేవులు పరోపకార పరాయణులు. ఈ ప్రాపంచిక దృష్టిలో పరోపకారమనగా పరులకు ఉపకారము చేయుట. కానీ శ్రీగురుదేవులకు పరులైన వారు ఎవరూ లేరు. అందరూ వారి బిడ్డలే. అలా వారి సంతానమైన మనము అశాశ్వతమైన ఈ ఇహలోక భోగములలో పడి మన స్వస్థలమైన శాశ్వతమైన పరమ పదాన్ని మరచిపోయినప్పుడు శ్రీగురుదేవులు తమ తత్త్వ బోధ చేత మన నిజస్వరూపాన్ని ఎఱుక పరచి, మనకు ఆ పరమ పదాన్ని ప్రాప్తింపచేయుటయే వారు చేయు పరోపకారము.

**149. ఓం స్వరూపజ్ఞాన కోవిదాయ నమః**

శ్రీ గురుదేవులు పరమాత్మ యొక్క నిజ స్వరూపాన్ని ఎఱిగిన వారు. స్వరూపము అనగా తన రూపము. మనము పుట్టినప్పటి నుంచి ఈ ప్రపంచమునే చూస్తూ దేహమే మన నిజ రూపమని భ్రమించి అనేక బాధలను, భయాలను అనుభవించుచున్నాము. అట్టి మనకు తమ బోధ ద్వారా మన నిజ రూపమైన పరమాత్మ వస్తువును దర్శింపచేసి మనలోని అజ్ఞానమును పోగొట్టి ఆత్మ జ్ఞానాన్ని ప్రసాదించే సమర్థులు శ్రీగురుదేవులు.

- సశేషం

# శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గత సంచిక తరువాయి)

- కీ.శే. రమణ ప్రసాద్

"అవును నాయనా! నేనే! స్త్రీ సహజమైన ఈర్ష్య, అసూయలకు వశమై నా కృష్ణుడికి అపచారం చేశా, కానీ స్వామికి నా పైన ఎంత కరుణో! నా దుష్కృత్యానికి దండన నేను భరించలేనని తనకి తానే విధించుకున్నాడు. అందుకే అందరం అనుభవిస్తున్నాం. నా దుష్కృత్యానికి దండన నేనే అనుభవించాలి కాని, నా ప్రభువు చూడు యాదవ కులాన్ని, ద్వారక నగరాన్ని సైతం ఈ విధంగా త్యాగం చేశాడు" సత్యభామ ఆవేదన భరించలేక నిలువునా కుప్పకూలిపోయింది. రుక్మిణి అవాక్కైంది. నెమ్మదిగా సత్యభామను లేవదీసి కూర్చుండబెట్టి ఊరడించింది.



"చెల్లీ! నువ్వు మనస్సును ఎందుకంత వికలం చేసికొంటావు?" అంది రుక్మిణి. "ఈ దుఃఖానికి అంతం లేదక్కా! అర్జునా! నా హృదయాన్ని శూలంతో పొడిచినట్లుగా ఉంది. ఈ దుఃఖభారాన్ని మోయలేకపోతున్నాను. నేను ఆ పాపాన్ని స్వీకరించటంతో కొంత ఉపశమనం కలుగుతుంది" అంటూ సత్యభామ విలపించ సాగింది. రుక్మిణి చేతిని తన చేతిలో ఉంచుకొని చాలా సేపు నిమురుతూ వుండిపోయింది. అర్జునుడు సత్యభామ పాదాల చెంత కూర్చుని యాంత్రికంగా శూన్యంలోకి చూస్తున్నాడు.

"నేను నిజం చెబుతున్నాను. నేను ....నేనే... .కృష్ణుణ్ణి దుఃఖపెట్టాను. అలా దుఃఖితుడైన శ్యామసుందరుడు ముఖం తిప్పుకున్నాడు. రుక్మిణీ.... ఓగుడాకేశా! వీరాగ్రేసరా! ఆ రోజు.... ఆ రోజు..." అంటుంటే సత్యభామ కళ్ళలో దుఃఖం!

**పారిజాత పుష్పం కథ –**

ఎలా వస్తాడో త్రిలోక సంచారి అయిన నారదుడు ; ఆయన ఆగమనం ఎన్నడూ ఊహించని విధంగా ఉంటుంది. ఒకరోజున కృష్ణుడు నిత్య నైమిత్తిక కార్యాలు తీర్చుకొని కూర్చున్నాడో లేదో నారదుని వీణా ఝుంకారం వినిపించింది. కృష్ణుడు లేచి దేవర్షికి స్వాగతం పలికి సత్కారాలు చేసి ఉచితాసనంపై కూర్చుండబెట్టాడు. పాద ప్రక్షాళన చేసి నారదుడి కంటె క్రిందగా ఉన్న ఆసనంపై కూర్చుని నారదుడికి ప్రణామం చేశాడు.

"దేవర్షీ! ద్వారకకు చాలా రోజుల తరువాత వచ్చి మీ పాదధూళితో ఈ గడ్డను పావనం చేశారు" "అచ్యుతా! హిమాలయ పరిభ్రమణంలో రోజులు ఎలా

గడిచిపోయాయో తెలియలేదు, ఇప్పుడే కైలాస పర్వత యాత్ర చేసి వస్తున్నా" అన్నాడు నారదుడు. "అది నా భాగ్యం నారదా! కైలాసం నుండి మీరు తెచ్చిన ప్రసాదం తీసికొని మేము ధన్యత చెందుతాం."

"కృష్ణా!" అంటూ తమ ఉత్తరీయంలోని ఒక చివర నుంచి అప్పుడే వికసించిన ఒక పెద్ద పుష్పమును తీసి కృష్ణుడికి ఇస్తూ "ఇది బ్రహ్మకమలం. కైలాస పర్వతంలోని పావన జలాలనుండి కోసి శంకరుడి చరణకమలములకు అర్పించి తెచ్చినదీ పుష్పం. ఇది ఎన్నటికీ వాడిపోదు" అన్నాడు నారదుడు.

కృష్ణుడు, రుక్మిణి ఇంకా అక్కడ ఉపస్థితులైన వారందరూ నారదుని చేతిలో ఉన్న ఆ అద్భుతమైన పుష్పాన్ని ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయారు. కృష్ణుడు నారదుని చేతిలోని బ్రహ్మకమలాన్ని తీసికొని దానిని తన మూర్ధానికి ఆనించి తనకి ఎడమవైపున కూర్చున్న రుక్మిణికి ఇస్తూ "రుక్మిణీ! ఈ పుష్పం నీ ఘనకేశరానికి శోభాయమానంగా ఉంటుంది. శంకర భగవానునిచే ఆశీర్వదింపబడిన ఈ పుష్పాన్ని నిత్యం ధరించు" అన్నాడు కృష్ణుడు.

రుక్మిణి ఆనందాతిరేకంతో తన నాధుని ఆశీర్వచనంగా ఆ పుష్పాన్ని స్వీకరించి, తన కేశపాశమందు ధరించింది. "ఈ పుష్పధారణతో నీవు ఎంతో అందంగా కనిపిస్తున్నావు దేవీ! ఎవరో యక్షకన్య వన విహారానికి వచ్చినట్లుగా అనిపిస్తున్నది దేవీ! ఇది ముమ్మాటికీ నిజం" అన్నాడు శ్రీకృష్ణుడు దరహాస చంద్రికలు విరజిమ్ముతూ.

రుక్మిణిలో సిగ్గుతెరలు ముంచుకు వచ్చాయి. దేవర్షి నారదుడు వారి ఆనందదాయకమైన, నిర్మలమైన దాంపత్యాన్ని తిలకిస్తూ ఉండిపోయాడు. ఆ తరువాత చాలా సేపు కృష్ణునితో ధర్మచర్చ, గోష్ఠి సలిపి తన నిజ వాసమునకు తిరిగి పోయాడు.

"నారదుడిచ్చిన పవిత్రమైన బ్రహ్మకమలాన్ని శ్రీకృష్ణుడు స్వయంగా రుక్మిణకి ఇచ్చి తన కేశరాశిలో తురుముకొమ్మని చెప్పటం, ఆ కమలాన్ని ధరించి రుక్మిణి యక్షకన్యలా మెరిసిపోతున్నదని శ్రీకృష్ణుడు మెచ్చుకోవటం... ఇదంతా నేను విన్నాను. రోషాగ్ని జ్వాలలు నన్ను నిలువెల్ల దహించివేశాయి. అంతవరకు శ్రీకృష్ణుడి ప్రేమ నాకే సొంతం అని మురిసిపోయేదాన్ని, రుక్మిణి లోకదృష్టిలో శ్రీకృష్ణునికి పట్టపురాణి అయితే కావచ్చు; కాని శ్రీకృష్ణుని ప్రేమ సామ్రాజ్యానికి నేనే పట్టపురాణిని. ఆ నమ్మకంతోటే నేను ఆ రోజువరకు జీవించాను. కాని ఆ రోజుతో ఆ నమ్మకం వమ్మయింది. ఆ రోజు.... ఆ రోజు నా నాధుడు రుక్మిణి ఎడల సర్వాధికమైన ప్రేమను కురిపించాడు...కాదు కాదు; ఆమెనే అందరికన్నా మిన్నగా ప్రేమిస్తున్నట్లు అందరిముందు చాటి చెప్పాడు. బ్రహ్మ కమలం వంటి అపురూపమైన, అరుదైన పుష్పాన్ని నాకు ఇయ్యక రుక్మిణికి ఇవ్వటం ఇదే మొదటిసారి. ఇంతకు ముందెన్నడూ అలా జరగలేదే!

- సశేషం

# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**భక్తి సూత్రము 62: "న తత్సిద్ధౌ లోకవ్యవహారో హేయః కింతు ఫలత్యాగస్తత్సాధనం చ కార్యమేవ"**



తాత్పర్యము: భక్తి సిద్ధించాలనే మిషతో లోకవ్యవహారాన్ని, దైనందిన కర్తవ్యాలను విడిచిపెట్టకూడదు. కానీ ఆ కర్మల ఫలితాలపై ఆసక్తిని విడిచిపెట్టాలి; అలాగే భక్తిని పెంచే సాధనలను తప్పకుండా ఆచరించాలి. ఈ భక్తి సూత్రం ద్వారా నారదులు భక్తి మార్గంలో అత్యంత సమతుల్యమైన, ఆచరణాత్మకమైన బోధనను, భగవద్గీత సారంతో మిళితం చేసిన సారాంశమును అందిస్తున్నారు. చాలామంది ఆధ్యాత్మిక జీవితం అంటే ప్రపంచాన్ని వదిలేయడం, కుటుంబం, ఉద్యోగం, సంబంధాలు, సమాజ బాధ్యతలు అన్నీ విడిచిపెట్టడం అని భావిస్తారు. కానీ నారద మహర్షి ఇక్కడ స్పష్టంగా--- భక్తి సిద్ధించడానికి లోకవ్యవహారాన్ని విడిచిపెట్టాల్సిన అవసరం లేదు. భక్తి అనేది జీవితానికి వ్యతిరేకం కాదు; జీవితం దైవమయం కావడానికి మార్గం - అని స్పష్టంగా తెలియచేస్తున్నారు.

ఇక్కడ "లోకవ్యవహారం" అంటే మనం ప్రతిరోజూ చేసే ధర్మబద్ధమైన పనులు. కుటుంబాన్ని పోషించడం, ఉద్యోగం చేయడం, సమాజంలో మన బాధ్యతలను నిర్వర్తించడం, మన శరీరాన్ని, మనసును, సంబంధాలను సరైన విధంగా నిర్వహించడం వంటివి. ఇవన్నీ భక్తికి అడ్డంకులు కావు. నిజానికి వీటినే భగవద్భక్తికి సాధనాలుగా మార్చుకోవచ్చు అన్నది ఈ సూత్రంలోని సారాంశం.

ఇదే అంశాన్ని శ్రీ బాబూజీ మహారాజ్ ఎంతో సరళంగా ఒక చేతిని మానసికంగా గురుదేవుని పాదములపై వుంచి తన దైనందిన కార్యక్రమాలు పూర్తి చేసుకొని తిరిగి పనులన్నీ ముగించుకుని మరొక చేతిని కూడా గురు పాదముల చెంత చేర్చుకోగలిగిన సాధకుడికి బాహ్యమైన వ్యవహారాలు కూడా సాధనగా మారుతాయని బోధించారు. అలాంటి భక్తుడు లోకంలో ఉంటాడు, కానీ లోకం అతని హృదయంలో యజమానిగా ఉండదు. అతను పని చేస్తాడు, కానీ దాని ఫలితానికి బానిస కాడు. అతను బాధ్యతలు నిర్వర్తిస్తాడు, కానీ ఫలితం తనదే అనే అహంకారంలో పడడు. ఈ సూత్రంలో ముఖ్యమైన మాట "**ఫలత్యాగః**". నారదులు కర్మను త్యజించమని చెప్పడం లేదు; కర్మఫలంపై మమకారాన్ని త్యజించమని సెలవిస్తున్నారు. నిజమైన సమస్య పని చేయడంలో కాక ఫలంపై ఆసక్తిలో వుంటుంది. "నాకు ఈ ఫలితం రావాలి", "నా కోరిక తప్పక నెరవేరాలి" అనే ఫలాసక్తి మనస్సును బంధిస్తుంది. అదే ఆందోళన, భయం, అసూయ, నిరాశలకు

కారణమవుతుంది. కానీ భక్తుడు తన కర్తవ్యాన్ని భగవంతునికి అర్పణ భావంతో చేసినప్పుడు అదే అతనికి పూజగా మారుతుంది.

ఈ భావం భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన కర్మయోగ సారంతో పూర్తిగా కలుస్తుంది. "**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన**" అంటూ గీతాచార్యులు సాంఖ్య యోగములో కేవలం కర్తవ్యంపై మాత్రమే మన అధికారం ఉందని కర్మ ఫలంపై అధికారం లేదని బోధించారు. అదే విధంగా కర్మ యోగంలో "**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥**" అంటూ అన్ని కార్యములను పరమేశ్వరుడికే అర్పణం చేసి నిరంతరం భగవంతుని ధ్యాసలో ఉండి, ప్రతిఫలాపేక్ష, స్వార్ధ చింతనను విడిచి, శోకము పోగొట్టుకుని, కర్తవ్యమును నిర్వహించమన్న బోధను అర్జునుడితో పాటుగా సాధకులందరికీ వివరించారు కదా! అదే భావాన్ని నారదులు ఈ సూత్రంలో వివరిస్తూ "లోకవ్యవహారం విడవకూడదు, కానీ ఫలత్యాగం చేయాలి" అని తెలిపారు. ఇంకా లోతుగా చూస్తే, "**తత్ సాధనం చ కార్యమేవ**" అంటూ కేవలం ఫలత్యాగం చేయడం మాత్రమే కాక భక్తిని పెంచే సాధనలను కూడా తప్పకుండా చేయాలని నారదులు బోధిస్తున్నారు. కేవలం "నేను ఫలితం కోరుకోవడం లేదు" అని చెప్పడం సరిపోదు; హృదయాన్ని భక్తి వైపు మళ్లించే ఆచరణ కూడా అవసరం. శ్రవణం, కీర్తనం, నామస్మరణం, ధ్యానం, పూజ, సేవ, సత్సంగం, శాస్త్రపఠనం ఇవన్నీ భక్తిని బలపరిచే సాధనాలు. ఇవి లోకజీవనానికి విరుద్ధం కావు; ఇవి లోకజీవనాన్ని సైతం పవిత్రం చేస్తాయి.

ఇదే భావాన్ని గీతాచార్యులు వివరిస్తూ "**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్। యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్॥**" అంటూ "నీవు ఏ పని చేసినా, నీవు ఏది తిన్నా, నీవు యజ్ఞములో అగ్నికి ఏది సమర్పించినా, దానం ఇచ్చినా, మరియు ఏ కర్మలను ఆచరించినా, వాటిని నాకు సమర్పించినట్టుగా చేయుము" అని బోధించారు.

దానినే శ్రీ బాబూజీ మహారాజ్ "**ధ్యానాగ్ని దగ్ధ కర్మాణి**" అంటూ అన్ని కర్మలూ కర్మ బీజాలు ఆ నామ స్మరణతో నశిస్తాయి అని సెలవిచ్చారు. ఆ విధంగా లోకవ్యవహారం మానేయడం కాక; భగవదర్పణంగా చేయడమే సాధకుడి కర్తవ్యం. ఉపనిషత్తులు కూడా లోకంలో కర్మలను చేస్తూనే జీవించమని బోధిస్తూ కర్మలో బంధనాన్ని విడవమని వివరిస్తాయి. కాబట్టి ఈ సూత్రం ద్వారా ఒక గొప్ప జీవన సూత్రాన్ని అందిస్తూ : "లోకంలో వుండు, కానీ లోకబంధనంలో పడకు. కర్తవ్యాన్ని చేయి, కానీ ఫలంపై అధికారం చూపకు. బాధ్యతను నిర్వర్తించు, కానీ అహంకారాన్ని పెంచకు. ప్రతి పనిని భగవంతునికి అర్పణగా మార్చుకో" అన్న సందేశమును నారదులు బోధిస్తున్నారు. ఆ విధంగా జీవించినప్పుడు సాధకుడి హృదయం భక్తిమయం అవుతుంది, అతని పని కర్మయోగం అవుతుంది, మనస్సు శాంతిని పొందుతుంది.

- సశేషం

## శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**జూన్ 2026**

10 బుధ: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

13 శని: మాసశివరాత్రి, శనిత్రయోదశి

15 సోమ: అమావాస్య

16 మంగళ: జ్యేష్ఠ శుద్ధ విదియ – పావులూరు శాఖ వార్షిక సత్సంగ సమావేశములు. శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామి వారి ఆరాధన, హారతి.

23 మంగళ: జ్యేష్ఠ శుద్ధ నవమి – శ్రీ సుగుణ ప్రసాద మాతాజీవారి ఏకోనవింశతి(19) వార్షికారాధన. సత్సంగం.

27 శని: శనిత్రయోదశి

29 సోమ: నిజ జ్యేష్ఠ పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ.

**జులై 2026**

9 గురు: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

12 ఆది: మాసశివరాత్రి

14 మంగళ: అమావాస్య

17 శుక్ర: కర్కాటక సంక్రమణం – దక్షిణాయన పుణ్యకాల ప్రారంభం

25 శని: తొలి ఏకాదశి – ఏకాహం సంకీర్తన, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

29 బుధ: ఆషాఢ పూర్ణిమ – గురుపూర్ణిమ. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, అయిన శ్రీమతి రాధా కున్నీ మొహంతి (నరోత్తమ్ గారి సతీమణి) 16-5-26 శనివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 57 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# దేవుడి స్క్రిప్ట్

-కీ.శే. పెనుమాక నాగేశ్వర రావు

"దేవుడి స్క్రిప్ట్" ఈ మాట పాతదే అయినా, ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆ మాటకి ప్రాధాన్యత పెరిగింది. విధివ్రాతకి ఆధునిక పదం దేవుడి స్క్రిప్ట్ అనుకోవచ్చు. మనం ఓ సినిమాకి వెళ్ళాం. కొంతమందికి బాగా నచ్చుతుంది. కొంతమందికి ఫరవాలేదనిపిస్తుంది. ఇంకొంతమందికి మళ్ళీ మళ్ళీ చూడాలినిపించేంత నచ్చుతుంది. కొందరికి నచ్చదు. బాగానే ఉంది ఇంతవరకు. ఇక విశ్లేషకులు ఉంటారే వాళ్ళు ఒక్కొక్క సన్నివేశాన్ని విడమరచి ఆ సన్నివేశం ఇలా చూపించి వుండవచ్చు. ఆ సన్నివేశం పూర్తిగా తొలగించి వుండవచ్చు. ఇంకొక చోట ఇంకాస్త పొడిగించి వుండాల్సింది........ఇలా వ్యాఖ్యానాలు చేస్తుంటారు. కానీ రచయిత ఆ కధని అలా వ్రాశాడు. నిర్మాతకి అదే నచ్చింది. దర్శకుడికి అలా తీయాలనిపించింది. తీశారు. అయిపోయింది సినిమా. ఎవరెన్ని మాట్లాడినా, మారేది ఏమీ ఉండదు.

అలాగే మన జీవితపు స్క్రిప్ట్ కూడా భగవంతుడు వ్రాసిన విధంగా కొనసాగుతుంటుంది. ఇంతవరకు బానే వుంది. మన స్క్రిప్ట్ లో సంతోషకరమైన సన్నివేశాలకు పొంగిపోకుండా, విషాద ఘట్టాలకి కుంగిపోకుండా వుంటూ, సాక్షీభూతంగా వుండమంటున్నారే, అక్కడే వస్తున్నది పేచీ అంతా. సినిమా చూసి వచ్చి దాని బాగోగుల గురించి మాట్లాడుకునే మనం, మన వ్యక్తిగతం అయిన మన జీవితంలోని కష్టసుఖాలకు స్పందన లేకుండా వుండటం సామాన్యులకు సాధ్యమా? సాక్షాత్తూ శ్రీరామచంద్ర ప్రభువే కొన్ని సందర్భాలలో ఆవేదన చెందినట్లు విన్నాం. అలాగే శ్రీకృష్ణ భగవానుడు కూడా కొన్ని సమయాల్లో కలతపడినట్లు చదువుకున్నాం. అంతటి మహనీయులకే తప్పనప్పుడు మనం ఎంత! అనిపిస్తుంది.

నిజమే కదా? ఇలాంటప్పుడే మాతాజీ బోధలో తరచూ ఉపయోగించే పదం "ఎంతవరకో అంతవరకే" గుర్తుకు తెచ్చుకుంటే మన ఆవేదన గానీ, ఆనందం గాని పరిమితిలోకి తెచ్చుకోవచ్చనిపిస్తుంది. అనగా అనగా రాగం అన్నట్లు, అభ్యాసము కూసు విద్య అన్నట్లు ఆచరణలో పెట్టటం అంత తేలికయిన విషయం కాకపోయినా సద్గురుమూర్తిని మనం ఆ స్థితప్రజ్ఞత కోసం ప్రార్థిస్తే, ప్రాధేయపడితే సాధ్యమే అని గతంలో నిరూపించినవారూ ఉన్నారు. నిరూపిస్తున్నవారూ ఉన్నారు కదా. అందుకే ఆ భారం ఆయన మీదనే వేసి త్రికరణశుద్ధిగా ఆచరించటమే ఉత్తమ మార్గం అవుతుంది.

మన జీవితం అనే సినిమాకి నిర్మాత, దర్శకుడు, రచయిత, ఛాయా గ్రాహకుడు, ...అన్నీ భగవంతుడే. అటువంటి సినిమాలో మనం కేవలం నటీనటులమే. మనం ఇతర (ఇతరుల) సినిమా చూసినట్లే మన సినిమా కూడా చూడటమే మన కర్తవ్యం. చూశాక అది ఇలా ఎందుకు జరిగింది, అలా ఎందుకు జరగలేదు. ఇంకోలా అయ్యుంటే ఇంకా బాగుండేది......లాంటి విశ్లేషణలు చేసుకుని ఉపయోగం లేదు. మానవమాత్రులం కాబట్టి అనుకోకుండా ఉండలేము. సాంకేతికతని మెచ్చుకోవాల్సిన అవసరం ఎంత ఉందో, నొచ్చుకోవాల్సిన సందర్భాలు కూడా ఎక్కువే ఉంటున్నాయి.

మీరు ఫలానా శ్లోకం ఇన్నిసార్లు చదివితే మీ కోరిక నెరవేరుతుంది అనో, ఫలానా మంత్రం అన్నా,విన్నా ఫలితం వెంటనే పొందుతారనో, ఫలానా క్షేత్రంలో ఫలానా దేవుడి ఆలయానికి వెళ్ళి దర్శనం చేసుకుంటే అన్ని పనులు సక్రమంగా జరిగిపోతాయనీ చెబుతున్నారు. కొందరు ప్రవచనకారులేమో మీరు ఎన్ని పూజలు చేసినా, ఎన్ని క్షేత్రాలు తిరిగినా కర్మఫలము అనుభవించక తప్పదు అని హెచ్చరిస్తున్నారు.

ఇటీవల ఎక్కడో చదివిన గుర్తు.....చాలామంది సంపద కావాలని దేవుణ్ని కోరుకుంటున్నారు గానీ ఆ సంపదని అనుభవించే అదృష్టాన్ని కూడా కోరుకోవటం మర్చిపోతున్నారు. మర్చిపోతున్నారు అనే కంటే దేవుడే మరిపింపచేస్తున్నాడు అంటే బాగుంటుందేమో. అదీ ఆయన మాయలో భాగమేగా మరి!

సంపద అంటే ఆంగ్లంలో చెప్పిన సూక్తి ఒకటి గుర్తుకు వస్తున్నది. Richness is not earn more, not save more, but need no more is real richness ఎంత గొప్ప మాట! సద్గురుదేవుల పాదాలను పట్టుకుని అదిగో అలాంటి రిచ్‌నెస్‌ని మనకు ప్రసాదించమని కోరుకోవటానికి సిద్ధపడితే మనం ధన్యులమే.

***నావికుడు లేని నావలా, నాయకుడు లేని వర్గంలా, నాగరిక ప్రపంచంలో ఎటో కొట్టుకుపోతూ, నానాటికీ భగవంతునికి దూరం దూరంగా జరిగిపోతున్న జనులను తన అక్కున జేర్చుకొని లాలించి, అవ్యాజ ప్రేమను కురిపిస్తూ, భగవంతుని సన్నిధికి చేరే బాటలో ఒక్కొక్క అడుగు వేయిస్తూ నడిపించుకుపోయేవాడే సత్య గురువు.***

- శ్రీ బాబూజీ మహరాజ్

# మాయా విలాసం

-వేలమూరి రవికుమార్

(గత సంచిక తరువాయి)

దేహము, శరీరము ఏ రకముగా పిలిచినా ఇది మార్పుని సూచిస్తుందే కానీ, నిత్యము, సత్యము అయిన ఆత్మని కాదు. అందుకే శ్రీ కులశేఖరాళ్వారు **ఇదం శరీరం పరిణామ పేశలం । పతత్యవశ్యం శ్లీధి సంధి జర్జరం । కిమౌషధైః క్లిష్యతి మూఢ దుర్మతే। నిరామయం కృష్ణ రసాయనం పిబ॥** – అని చెప్పి వున్నారు. కృష్ణ రసాయనం, లేక రామ రసాయనం అదే గురు లక్ష్యార్థ రసాయనం మాత్రమే జనన మరణ బాధల నుండి మనలను విముక్తులను చేసి, సత్యము, నిత్యము, శాశ్వతము అయిన ఆత్మానందాన్ని పొందించ గలదని తెలియజేశారు.

'రా' అనగా ఆత్మ వస్తువు, 'మ' అనగా మనస్సు. మనలోని దశ విధ గుణములే దశకంఠ రావణుడు. దశకంఠ రావణుని (దశవిధ గుణములను) సంహరించి, మనస్సుని ఆత్మ వద్దకు చేర్చడమే మన లక్ష్యమని శ్రీ గురుదేవులు పలుమార్లు ఉటంకించి వున్నారు. రా అనగా మరొక అర్థం తత్ అనగా పరబ్రహ్మము, మ అనగా త్వం అని అనగా జీవాత్మ అని మరొక అర్థం. జీవాత్మను పరమాత్మయందు లయం చేయడమే శ్రీ తారక మంత్ర రహస్యార్థం అని పెద్దలు చెప్పారు.

ఇక్కడ మాయ గురించి ప్రస్తావిస్తున్నప్పుడు శ్రీ వశిష్ఠులు శ్రీరామచంద్ర ప్రభువుకి యోగవాశిష్ఠంలో మాయా ప్రభావాన్ని తెలియజెప్పిన కథ గుర్తుకు వస్తున్నది.

పూర్వం గాధి అనే ముని పుంగవుడు వుండేవాడు. అతడు సంసారం పట్ల నిరాసక్తుడై, జనావాసానికి దూరంగా ఒక పర్ణశాల నిర్మించుకుని, ఎక్కువ సమయం విష్ణుచింతనలో గడిపేవాడు. ఆయన 12 సంవత్సరాలు శ్రీ మహావిష్ణువు గురించి తపస్సు చేశాడు. విష్ణువు సంతుష్టుడై, కరుణాంతరంగుడై, దివ్య తేజస్సుతో వెలుగొందుచుండగా, ప్రేమరసము కనుల నుండి జాలువారుతుండగా, వజ్ర కిరీటముతో, శంఖ, గదా హస్తుడై, లక్ష్మీ సమేతుడై, వక్షస్థలమందు వైజయంతి మాల ప్రకాశించుచుండగా తులసీమాలా విభూషితుడై చిరుమందహాసవదనుడై ప్రత్యక్షమయ్యాడు. గాధిని 'నీకేమి వరం కావలెనో కోరుకో'మన్నాడు.

అప్పుడు గాధి 'స్వామీ! మీ మాయా విలాసమును తెలుసుకొనే అనుభవాన్ని నాకు కలుగుజేయండి' అని ప్రార్థించాడు. స్వామి 'తథాస్తు' అని పలికి 'గాధీ! నీకు నా మాయా విలాసము అనుభవానికి వస్తుంది. ఆ అనుభవం పొందిన తరువాత మాయను దాటి నన్ను చేరుకొనెదవు గాక!' అని ఆశీర్వదించి అంతర్ధానమయ్యాడు. గాధి ఎప్పుడు

శ్రీమహావిష్ణువు యొక్క వరము ఫలిస్తుందా! అని వేచి చూడసాగాడు. ఒకరోజు గాధి ముని పర్ణశాల వద్ద వున్న కొలనులో నడుములోతు నీటిలో నిలబడి సూర్యునికి ప్రాతఃకాల అర్ఘ్యమిస్తున్నారు. దర్భలు చేత ధరించి మంత్రోచ్ఛారణ చేస్తూ నీటిని గుండ్రంగా త్రిప్పుచుండగా ఆ క్రియకు నీటిలో అలలు ఏర్పడసాగాయి. అంతలో గాధిముని నీటిలో మునకలు వేస్తున్నారు. మొదటి మునుక అనంతరం రెండవ మునక వేశారు. అప్పుడు ఒక విచిత్రమైన భావనా పరంపరకు మనస్సు గురవసాగింది. గాధిమునికి తాను అస్వస్థుడు అయినట్లు, ఆయన ఆ పర్ణకుటీరంలో పడుకుని వున్నట్లు అనుభవం కలిగింది. తన తల్లిదండ్రులు, సోదరులు, భార్య తన చుట్టూ చేరి రోదిస్తున్నారు. గాధిముని చూస్తూ వుండగానే, గాధిముని మరణించాడని, అతని శరీరాన్ని తీసుకెళ్ళి దహనం చేశారు.

గాధి శరీరంలో నుండి జీవుడు బయటపడి అక్కడి నుంచి దూరంగా వున్న కీకారణ్యంలోకి ప్రవేశించింది. అక్కడ కుక్కమాసం, పచ్చిమాంసం తినే ఒక కిరాతకుని భార్య గర్భంలోకి ప్రవేశించింది. ఆమె గర్భవతి అయింది. అందరు కిరాతుల మాదిరిగానే ఆవిడ కూడా నిత్యం పచ్చిమాంసహార సేవనం, మద్యపానం చేసేది. ఆవిడ నల్లగా తుమ్మ మొద్దులాగా వుండేది. తొమ్మిది నెలలు నిండాక ఆవిడకి నల్లగా, తుమ్మమొద్దులా బలిష్ఠుడైన బిడ్డ జన్మించాడు. ఆ బిడ్డకు వారు కఠంజుడని నామకరణం చేశారు.

కఠంజుడు మంచి బల సంపన్నుడు, వాడు అనేక మృగాలను వేటాడి, పచ్చిమాంసం, మద్యంతో విలాసంగా గడుపుతున్నాడు. ఆ గూడెంలో వాడికి ఎదురు లేకపోవడంతో వాడే ఆ గూడేనికి రాజయ్యాడు. వట్టి చేతులతో క్రూర జంతువులను సైతం ఎదుర్కొని చంపగిలిగే సాహసం చూసి అతనిని ఆ గూడెం వారందరూ పొగిడేవారు.

తనకు నచ్చిన ఒక కన్యను వివాహమాడాడు. ఆమెతో విచ్చలవిడిగా అడవి అంతా తిరుగుతున్నాడు. ఆమె ద్వారా అతనికి సంతానం కూడా కలిగింది. తనకు నడి వయస్సు కూడా వచ్చింది. అంతలో ఏమయిందో, ఏమో కాని ఒంటరిగా జీవించడం మొదలు పెట్టాడు. తన ఒంటరి జీవితం అతనికి దుర్భరంగా అనిపించింది. ఆ పైన వయస్సు పెరగడంతో చావు భయం మొదలైంది. ఇంక ఆ గూడెంలో వుండలేక, అక్కడి నుండి పలు రాజ్యాలు తిరుగుతూ చివరకు కీర రాజ్యానికి వచ్చాడు.

- సశేషం

# గురోరంఘ్రి పద్మే మనస్చే న్న లగ్నం

-భాగవతుల హనుమత్ జయప్రద

**గురోరంఘ్రి పద్మే మనస్చే న్న లగ్నం** సాధకుని యొక్క మనస్సు ఆశా పాశాలకు, రాగ ద్వేషాలకు, అహంకార మమకారాలకూ బంధింపబడి వుంటుంది. దాని నుండి బయట పడాలి అన్న ఆలోచన కూడా రానివ్వకుండా మాయ బలీయంగా ఉంటుంది. మొదట తాను ఎవరో తెలుసుకోవాలని మొదలు పెట్టిన ప్రయాణం, కొన్ని రోజులకి గతి మరిచి, తాను ఉన్న స్థితిని కూడా మరిచి, మధ్యలో పొందే తాత్కాలిక ఆనందాలతో సంతృప్తి చెంది, మళ్ళీ అదే మాయలో పడి కొట్టు మిట్టాడుతూ ఉంటాడు. ఈ దశలో స్వయం ప్రయత్నం చాలామేరకు నిరుపయోగమై పోతుంది. ఎన్ని సార్లు సంకల్పం తీసుకున్నా, ఎన్ని మార్లు "ఇకపై ధ్యానంలోనే నిలబడాలి, ఇకపై మనస్సుని అంతర్ముఖం చెయ్యాలి" అని నిర్ణయించినా, అది కొద్ది రోజులు, కొద్ది గంటలకే! మరల పాత వాసనల ప్రవాహంలో కొట్టుకుపోతుంది. అక్కడే గురుతత్వం అవసరం ఎంతటిదో బలంగా తెలిసివస్తుంది. సాధకుడు మెల్లగా గ్రహించడం మొదలు పెడతాడు --"నా బలంతో, నా బుద్ధితో, నా పట్టుదలతో నేను ఈ మాయను దాటలేను. నాకు కావలసినది, కేవలం వాచాజ్ఞానం కాదు, సద్గురువు తమ యొక్క బోధ ద్వారా ప్రసాదించే అనుభవ జ్ఞానం" అని.

ఎప్పుడైతే బాహ్యమైన విషయాలమీద ఆసక్తి నిరుపయోగము అని మనస్సుకు అనిపిస్తుందో, అప్పుడు మాత్రమే గురుదేవులు ప్రసాదించే బోధని సాధకుడు ఆచరణలో పెట్టగలుగుతాడు. మాయని జయించలేక పోవడానికి ఒక కారణం శాస్త్రవాసన. వివిధమైన విషయాలు తనకు తెలుసునని పొందే గర్వం. **షడంగాదివేదో ముఖే శాస్త్రవిద్యా కవిత్వాదిగద్యం సు పద్యం కరోతి। గురోరంఘ్రి పద్మే మనస్చేన్నలగ్నం తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్॥** మనిషి వేదాలు (షడంగాలతో సహా) బాగా అభ్యసించి వుండొచ్చు, శాస్త్రాలలో పాండిత్యం సంపాదించి వుండొచ్చు. అతను కవిత్వం, గద్యము, పద్యము వంటి సాహిత్యాలను చక్కగా రచించే ప్రతిభ కలవాడై వుండొచ్చు. అయితే, అతని మనస్సు గురువు పాదపద్మాలపై లగ్నం కాలేదంటే ఆ విద్యలన్నీ ఉన్నా ప్రయోజనం ఏమిటి?

ఒకసారి ఋభు అనే ముని దగ్గరకు, నాభాగుడు అనే పండితుడు వచ్చాడు. ఋభు మహర్షి నిజమైన సన్యాసి, జ్ఞాని. నాభాగుడు బాగా శాస్త్రాలు అన్ని చదువుకున్నాడు, వేదాలని అవపోసన పట్టాడు. ఆత్మ జ్ఞానం గురించి అనర్గళంగా ఉపన్యాసాలు చెప్పగలడు. ఋభు మహర్షి దగ్గరకు వచ్చి, అదే విధంగా 'ఆత్మ సర్వత్రా నిండి ఉంది, నాలో ఉన్నది, మీలో వున్నది, అంతా ఒకటే స్వరూపం. రెండిటికి బేధం లేదు' అని, తనకు తెల్సిన వాచాజ్ఞానంతో, గుక్క తిప్పకుండా చెప్పసాగాడు. ఈ లోగా ఆ ప్రక్కగా ఒక రాజుగారి ఊరేగింపు వెళుతుంది. రాజుగారు, ఏనుగు అంబారిని ఎక్కి కూర్చున్నారు. క్రింద సేవకులు, వాయిద్యాలు మ్రోగిస్తూ, నృత్యాలు చేస్తూ, కోలాహలంగా రాజు గారిని ఊరేగిస్తున్నారు.

ఇదంతా చూసిన నాభాగుడు, 'అసలు రాజు ఎవరు, ఏనుగు ఎవరు? రాజు తల మీద కిరీటం ఎందుకు? రాజు ఎందుకు ఏనుగు పైన కూర్చోవాలి? ఏనుగుకి ఎందుకు కిరీటం పెట్టకూడదు? రాజుకి మాత్రమే ఎందుకు పెట్టాలి? రెండిటిలోను ఉన్నది ఒకే ఆత్మ వస్తువు కదా? అని మాట్లాడతాడు.

వెంటనే ఋభు మహర్షి తాను ఉన్న ఆసనం మీద నుండి లేచి నాభాగునిపై కూర్చుని, నేను ఎందుకు ఇక్కడ కూర్చోకూడదు? అక్కడే ఎందుకు కూర్చోవాలి? అని ప్రశ్నిస్తాడు. ఎప్పుడైతే, గురువు యొక్క పాదాలు నాభాగుని స్పృశించాయో అతనిలో ఉన్న, అహంకారం మటుమాయమవుతుంది. వెంటనే తాను చేసిన తప్పుని తెలుసు కుంటాడు. గురువు పాదాల మీద పడతాడు.

గురువు పాదాలలో మనస్సు లగ్నం కావడం అంటే --- తన అహంకారాన్ని పూర్తిగా విడిచిపెట్టడం. "నేను తెలిసినవాడిని" అనే భావం కరిగిపోవడం. గురువు కృప కలిగినప్పుడు, మనస్సు క్రమంగా శుద్ధి చెందుతుంది. వాసనల బలం తగ్గుతుంది. చివరికి, **'గురోరంఘ్రి పద్మే మనస్చే న్నలగ్నం'** అనే స్థితి స్థిరపడినప్పుడు, మాయ తన ప్రభావాన్ని కోల్పోతుంది. తాను ఎవరో తాను తెలుసుకోగలిగే స్థితికి మరల గురుదేవులు సాధకునికి దారి చూపగలరు.

## వేస్తుంటే ఒక్కొక్క దండా మీ మెడ నిండా

-కీ.శే. పెనుమాక నాగేశ్వర రావు

వేస్తుంటే ఒక్కొక్క దండా మీ మెడ నిండా
ఎన్నెన్నో తీయని గురుతులు మా మది నిండా
బాబూ......వేస్తుంటే ఒక్కొక్క దండా.......
మీ కరముల రెంటా వరముల పంటా .....
కనుదోయి వెంటా ఆశీశ్శులంటా ......... ॥వేస్తుంటే॥

చూస్తుంటే మీ కన్నులలోకి ఏకంగా ....... తదేకంగా
ఎన్నెన్నో సంజ్ఞలు మా హృది పులకింపా
మీ వదనము నిండా వెన్నెల పంటా........ వదనము నిండా.....
పెదవుల వెంటా చిరునవ్వులంటా ............. ॥వేస్తుంటే॥

కూర్చుంటే మీ సన్నిధిలో మౌనంగా
మారునులే అదియే మా ధ్యానంగా
ధన్యములే మా జన్మలు మీ మూలంగా
భావింతుములే అదియే మా భాగ్యంగా...... ॥వేస్తుంటే॥



(గత సంచిక తరువాయి) **నిరీక్షణ** తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

"అన్నా! నా ఆలోచన మిమ్ములను, మన అసురకులమును కాపాడుటయే!" అని బదులిచ్చిన విభీషణుని గాంచి, "నీవేమియూ నన్ను, మన అసురకులమును కాపాడనవసరం లేదు. కావాలంటే నీవు ఆ రాముని వద్దకు వెళ్ళి శరణుగోరి ఆతనికి సేవకునిగనుండి నిన్ను నీవు కాపాడుకొనుము. నిన్ను నా తమ్ముడు అని చెప్పుకోడానికే నాకు సిగ్గు వేస్తుంది" అని చెప్పి ఇంకొన్ని కఠిన పదజాలముతో విభీషణుని నిందించాడు. సభలో అచ్చటనున్నవారందరూ రావణుని మాటలకు వత్తాసు పలికి విభీషణుని హేళన చేసారు. బాధతో తలవంచుకుని విభీషణుడు అచ్చటనుండి నిష్క్రమించి తనకున్న నలుగురు మంచి మిత్రులతో కలసి రాముడున్న స్థలమునకు వెళ్ళిపోయాడు.

అభయమును కోరిన విభీషణుని తమతో చేర్చుకోవచ్చునాయని సుగ్రీవుని, జాంబవంతుని మరియు వానరవృద్ధులను రాముడు అడిగినప్పుడు, హనుమంతుడు తప్ప మిగిలిన వారందరూ విభీషణుని అవసరం వారికి లేదనే చెప్పారు. కానీ హనుమంతుడు మాత్రం విభీషణుని సత్కీర్తిని వారికి తెలియపరచి "ఆతని రాక మనకు శుభకరమే!" అని బదులిచ్చాడు రామునికి.

చివరకు రాముడు తన శరణాగత ధర్మముననుసరించి, "శరణు కోరినవారిని కాపాడడం నా ధర్మం. ఒకవేళ రావణుడే మనసు మార్చుకుని నా వద్దకు వచ్చి శరణు కోరినట్లైతే ఆతనిని కూడ కాపాడెదను" అని తెలియజేశాడు కోసలదేశాధిపతి. (అయోధ్య సింహాసనము నధిరోహింప రాముని రాక కొరకు భరతుడు నిరీక్షిస్తున్నాడు కదా? కావున ఆతడు కోసల దేశమునకు అధిపతియే కదా?)

పిదప లక్ష్మణ, సుగ్రీవులను పిలిచి మంచి అసురుడైన విభీషణుడ్ని లంకా నగరమునకు రాజుగ పట్టాభిషేకమొనర్చవలయునను కార్యమును అప్పగించాడు.

"లోతైన ఆ సముద్రమును దాటి లంకానగరమునకు ఎలా వెళ్ళాలి?'యని రాముడు విభీషణ, సుగ్రీవులతో కలసి ఆలోచన చేసాడు. దాని ప్రకారం సముద్రరాజును మార్గము విడువమని ప్రార్థించాలని నిశ్చయించుకున్నారు. ప్రస్తుతం తిరుపుల్లాణి, మరియు దర్భశయనం అని పిలువబడుచున్న స్థలమందు రాముడు దర్భలను పరచి, ఏడు దినములు ఉపవాసం చేసి, సముద్రరాజైన వరుణదేవుని ప్రార్థించాడు. దానికి ఫలితం కనిపించకపోతే కోపగించిన కోదండరాముడు ఆ సముద్రమును ఎండిపోయి, భూమిలోనికి కృంగిపోవు విధమున తన వింటికి నారిని సంధించి బ్రహ్మాస్త్రమును సంధించాడు.

ఈ ప్రమాదమును గాంచి, సముద్రరాజు గజగజ వణకిపోయి, రాముని వద్దకు వచ్చి శరణు వేడుకున్నాడు. "ప్రకృతి ధర్మమునకు కట్టుబడిన నన్ను మన్నించవలయును.

నేను మీకు ఒక సహాయమును చేయగలను. నాపై పెద్ద పెద్ద బండరాళ్ళను వేసి ఒక వంతెనను కట్టండి. దాని భారమును నేను మోసెదను. ఆ వంతెనపై నడుచుకుంటూ మీరంతా నన్ను దాటి ఆ లంకా నగరమునకు చేరుకొనగలరు" అని చెప్పి రామునికి కైమోడ్పులర్పించాడు. తిరుపుల్లాణి చెంతనున్న ఒక స్థలమును జూపించి, అచ్చటనుండి సేతు నిర్మాణమును ఆరంభించ వలయునని తెలియజేసాడు.

వానర వీరులలో నలుడనబడు వానరుడొకడు ముందుకు వచ్చి, "అయ్యా! నేను విశ్వకర్మ వద్దనుండి వంతెనలను కట్టు విధమును నేర్చుకున్నాను. హనుమంతుని వంటి బలశాలులైన వానరులు ఇచ్చోటనున్న పెద్ద పెద్ద బండరాళ్ళను తీసుకుని వచ్చినట్లైతే మన కార్యము సులభముగ ముగియును" అన్నాడు.

నలుని స్నేహితుడు, నీలుడనబడు ఇంకొక వానరవీరుడు రాముని ముందుకు వచ్చి వినయముతో ఇలా అన్నాడు: "తండ్రీ! గత సమయమున నలుడు, నేను సుదీక్షణు లనబడు ఒక మునివర్యుల ఆశ్రమమందు ఆయన లేని సమయమున, ఒక ఆట ఆడుకొను విధమున, ఆయన పూజిస్తూ వచ్చిన సాలగ్రామములను చెంతనున్న తటాకమందు విసిరివేశాము.

ఆశ్రమమునకు తిరిగి వచ్చిన ఆ మునివర్యులు తాను పూజించు సాలగ్రామములు కానరాకపోవడంతో మిక్కిలి వ్యధచెంది పిచ్చిపట్టినట్లైపోయారు. ఆ సమయమున ఆశ్చర్యముగ తటాకమందు తామర పుష్పములు పూయుటనుగాంచి సుదీక్షణముని ఆ తటాకమువద్దకు వెళ్ళి గమనించగ అందలి స్వచ్ఛమైన నీటిలో తన సాలగ్రామములు కనబడ్డాయి. తక్షణమే వానిని వెలుపలికి తీసి, వాటిని మరల పూజ గదిలో బధ్రపరచారు. ఇలా కొలది దినములు మేము ఆ సాలగ్రామములను తటాకమున పడవేయడము, ఆయన మరల వెదకి తెచ్చుకుని తన పూజా మందిరములో వుంచడమనునది మాకు ఒక ఆటగా మారిపోయింది. దాంతో కోపావేశము చెందిన మునివర్యులు ఒక దినమున మమ్మల్ని గమనించి పట్టుకుని శపించబోయారు.

అప్పుడు మేము ఆయన పాదములను పట్టుకుని, "స్వభావసిద్ధమైన మా వానర చేష్టలను మన్నింపమ"ని ప్రార్థించాము. దానికి ఆయన మాతో "ఇకపై మీరు ఎలాంటి వస్తువులనైననూ నీటిలో పడవేసిననూ అవి మునగక తేలుతుండును" అని చెప్పి, "ఇది నా శాపమైనప్పటికీ ఇది మంచినే కలిగించును" అని మమ్ములననుగ్రహించారు.

నలుడు, నేను ఆ మునివర్యులకు నమస్కరించి, తిరిగివచ్చిన పిదప సుగ్రీవుని సైన్యములో చేరాము. తండ్రీ! సుదీక్షణముని అనుగ్రహముచేత మేమిరువురము వానర వీరులు తెచ్చియిచ్చు ఎట్టి రాతిబండనైననూ, వృక్షమునైననూ ఈ సముద్రజలముపై తేలియాడునట్లు గావించగలము. వంతెన నిర్మాణ కార్యమందు ఇదే మా భాగమగును" అన్నారు.

- సశేషం

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**గుకార శ్చాంధకారస్తు రుకారస్తన్నిరోధ కృత్**

**అంధకార వినాశిత్వా ద్గురురిత్య భిధీయతే.** **45**

**<u>పదవిభాగము</u>** :- గుకారఃచ-అంధకారః-తు-రుకారః-తత్-నిరోధకృత్-అంధకార- వినాశిత్వాత్-గురు-ఇతి-అభి ధీయతే.

**<u>టీక</u>** :- గుకారః='గు' అనే అక్షరవే; అంధకారస్తు= చీకటియనీ; రుకారః='రు' అనే అక్షరమే; తన్నిరోధకృత్= దానికి మారకము గనుక (నశింపజేయునది) అంధకార వినాశిత్వాత్= చీకటిని నశింపచేయుటచే "గురు" వని చెప్పబడుచున్నాడు.

**<u>వ్యాఖ్య</u>** :- "గు అంటే చీకటి, 'రు' అంటే దానికి మారకము, అజ్ఞానమనే అంధకారమును నశింపజేయువాడు గనుక "గురు"వని పిలువబడుచున్నాడు". చీకటి ఉన్నదని ఎలా తెలుస్తుంది? వెలుగు వల్లనే తెలుస్తుంది, చీకటికి మారకము గనుక చీకటిని కనుపింపజేసి నాశనము చేయుట వలన "గురు" శబ్దానికి "అజ్ఞానమనే చీకటిని నశింపజేయువాడు" అనే నిర్వచనం యివ్వబడినది. ఈ శ్లోకానికి ఒక పాఠాంతరము యిలా ఉన్నది.

***గుకారో భవరోగ స్స్యాత్ రుకారస్తన్నిరోధకృత్***

***భవరోగ హరత్వాచ్చ గురురిత్య భిధీయతే***

**<u>పదవిభాగము</u>** :-

గుకారః-భవరోగః-స్యాత్-రుకారః-తత్-నిరోధకృత్-భవరోగ-హరత్వాత్-చ-గురుఃఇతి-అభిధీయతే.

**<u>టీక</u>** :- గుకారః='గు' అనే అక్షరము; భవరోగస్యాత్=జనన మరణాదికమైన సంసారమను రోగము; రుకారః='రు' అను అక్షరము; తత్=దానిని; నిరోధకృత్=నిరోధించునది; అందుచేత భవరోగ=సంసార వ్యాధిని; హరత్వాత్=నివారించువారు; గురుయితి=గురువని; అభిధీయతే= పిలువబడుచున్నారు.

**వ్యాఖ్య** :- " 'గు' అంటే సంసార రోగము 'రు' అంటే దానిని నివారించుట. భవరోగమును తగ్గించువాడు గనుక 'గురు'వని పిలువ బడుచున్నాడు", సంసార మనేది వ్యాధి. దానితో శిష్యుడు బాధపడుతూ నా వ్యాధి ఎలా తగ్గుతుందా అని ఆవేదనపడుతున్నపుడు, గురుదేవుడు భవరోగ వైద్యుడై శిష్యుడి వ్యాధిని నివారించి ఉద్ధరిస్తాడు, ఈ శ్లోకంలో ఉన్న రూపకంలోని పోలిక అందరికీ తెలిసిన అనుభవమే గనుక తేలికగా అర్థం అవుతుంది.

- సశేషం

***ప్రేమాస్పదురాలైన తల్లి చెప్పే దాకా తండ్రి ఎవరో తెలియదు. కంటికి కనిపిస్తూ, పోషిస్తున్నప్పటికీ తల్లి చెప్పిన తరువాతే ఆయన తండ్రి అనే విశ్వాసం అంకురిస్తుంది. అప్పుడే ఆయన పట్ల గౌరవాన్ని, భయ భక్తులను వ్యక్తం చేయడం మొదలవుతుంది. తల్లి చెప్పకపోతే తండ్రి ఎవరో ఎలా తెలుస్తుంది? కంటికి కనిపించే తండ్రి గురించి తల్లి చెబితే గాని యదార్థ జ్ఞానం కలుగదు. అటువంటప్పుడు కనులకు కానరాని లోకజనకుడు, సృష్టికర్త, సర్వవ్యాపియైన ఆ పరమాత్మ గురించి అసలైన జ్ఞానాన్ని మనకు ఎవరు అందిస్తారు? ఇంకెవరు?? చీకటి నుంచి వెలుగు వైపుకు నడిపించే సద్గురువే మనకు భగవత్సంబంధమైన జ్ఞానాన్ని సుబోధకం చేస్తాడు.***

- శ్రీ గురుదేవులు

(గత సంచిక తరువాయి) **గురుకృప** కీ.శే.- వై. లక్ష్మీనరసమ్మ

గతయుగములందు రామక్రిష్ణుల నెరుగను
గాని,ఈ యుగమునందు వారిర్వురు నొక
డై నవతరించి నట్టి సద్గురుని కన్ను
లార గాంచితి నాజన్మ పుణ్యమేము.

భక్తుల వ్యవహారముల్ చర్చచేయు
రాముడే నీవు, వేరువేరు స్థలముల
యందు నొక్కటే సమయాన వుండు నీవు
క్రిష్ణుడవు, మరి రామక్రిష్ణుడవు కాదె.

కలియుగమిదని కలిమాయ తప్పించువా
రెవరని మతిమాలి వగచు టేల
సర్వ కలుష హరుడగు సద్గురుమూర్తి అం
డ మనకుండ మాయ యెట్లు వచ్చు.

నరసమ్మగారికి శ్రీబాబుకు పాదపూజ చేసుకోవాలి అని ఉండేది, కానీ ఏమంటారో అని భయంతో మిన్నకుండిపోయారు. చివరకు 1985లో దసరా పూజలకు వచ్చినప్పుడు లక్ష్మక్కగారితో తెలిపి శ్రీబాబును అడగమనగా 15 రోజుల తరువాత లక్ష్మక్కగారు ఫణిగారిచే ఉత్తరం రాయిస్తూ, "శ్రీబాబు ఎంతో సంతోషంగా చేసుకోమన్నారు, సెలవు చూసుకొని రమ్మన్నారు" అని చెప్పారు.

ఉత్తరం అందుకొని నరసమ్మగారు, కాళి ఇద్దరు ఆశ్రమానికి వచ్చి లక్ష్మక్కగారిని కలిసి శ్రీబాబు ఎప్పుడు పూజ చేసుకోమంటారో తెలుపమనగా, లక్ష్మక్కగారు శ్రీబాబుని అడిగితే "రేపే చేసుకోమన్నారు" అని అన్నారు. ఆరోజు కార్తీక శుద్ధ ఏకాదశి, శ్రీబాబు పాదపూజ చేయించుకుంటూ ఎలా చేసుకోవాలో కూడా చెబుతూ, "మనం వేసి పెంచుకున్న మొక్కకి పూలు పూస్తే ఎంత ఆనందంగా ఉంటుందో, వీళ్ళు పూజ చేసుకుంటుంటే అంత ఆనందంగా ఉంది. ఇప్పుడే కాదు ప్రతి సంవత్సరం దీక్షగా పూజ చేసుకోండి, పాదుకలకి చేసుకోవాల్సి వచ్చినా బాధపడకూడదు, గురువుకి గురుపాదుకలకు తేడా లేదు. టైం అయిపోయింది, ఏ కార్యక్రమానికి, పండుగకి

మానకండి, అన్నింటికి రండి." అని అన్నారు. ఇప్పడే ప్రతి సంవత్సరం చేసుకోమని చెప్పి అప్పుడే పాదుకలకు చేసుకోమంటున్నారు ఏమిటా అని ఇంక శ్రీబాబు పూజ చేయించుకోరా అని ఇద్దరు మధన పడ్డారు కానీ, 1986, 1987 సంవత్సరాలలో కూడా శ్రీబాబు పూజ చేయించుకున్నారు. అలాగే ప్రతి సంవత్సరం కూడా కార్తీక శుద్ధ ఏకాదశి నాడు నరసమ్మగారు వారి కుటుంబ సభ్యులు కలిసి శ్రీబాబు ప్రసాదించిన గురుపూజా భాగ్యాన్ని దీక్షగా చేసుకుంటున్నారు.

1988 సంవత్సరం నవంబర్ 19వ తేదీ ఏకాదశి రోజున నరసమ్మగారు, కాళి గురుపూజకి వచ్చారు.ఒక వారం రోజుల నుండి శ్రీబాబు అస్వస్థతగా ఉన్నట్లు తెలిసి ఒక ప్రక్క శ్రీబాబు గురించి భాధ, అయ్యో పూజ కదా గురుపాదస్పర్శ లభిస్తుందో లేదో అనే దిగులుతో ఉంటే ఆ రోజు పూజ శ్రీ గురుపాదుకలకు జరిగింది.ఆ మర్నాడు రాత్రి "శ్రీ బాబు రమ్మన్నారు మీతో మాట్లాడాలని" అని లక్ష్మక్కగారు కబురుపంపారు.

వీరు ఇద్దరు శ్రీబాబు దర్శనార్థం వెళ్ళగా శ్రీబాబు ముందుగా కొంతసేపు సరదాగా ప్రశ్నలు వేసి, నరసమ్మగారికి, కాళికి చంద్రక్క (శ్రీమాతాజీ) చేత బట్టలు పెట్టించి వారి కుటుంబ విషయాలు అడుగుతుంటే, "బాబూ మీరు నీరసంగా ఉన్నారు. మీకు శ్రమ అవుతున్నది, ఇప్పుడు మాట్లాడడమెందుకు విశ్రాంతి తీసుకోండి" అని నరసమ్మగారు అన్నారు.

దానికి శ్రీబాబు "నేను మీతో మాట్లాడాలని, చూడాలని మళ్ళీ ఎన్నాళ్ళకో కాని మాట్లాడుట కుదరదని మీ కోసమే ఓపిక చేసుకొని వచ్చి కూర్చున్నాను" అని అన్నారు. "బాబు మేము కూడా ఇక్కడ ఉండే వాళ్ళమే కదా స్థలం ఇప్పిచండి" అని కాళి అంటుండగానే శ్రీబాబు, "నేనిప్పిస్తాను" అని దానికి లెక్కలు కట్టి, "ఉద్యోగం చేయటం అయ్యాక ఇక్కడే ఇల్లు కట్టుకుని ఉండి సేవ చేసుకోవచ్చు" అని అన్నారు.

"బాబూ! మాకు సర్వం మీరే కదా" అని కాళి బాధ పడితే శ్రీబాబు, "ఇదే నీ పుట్టిల్లు, ఆశ్రమమే నీ పుట్టల్లు, మీ విశ్వాసం, ఆ విశ్వాసం అలా ఉన్నంత వరకు ఏమీ భయంలేదు, మీకు వీలున్నప్పుడల్లా ఆశ్రమానికి వస్తూండండి." అని చెప్పారు. వాళ్ళని వదిలి వెళ్ళలేక వెడుతున్నట్లు లోపలకు వెళ్ళారు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ హెడ్మాస్టర్ (వేదాంతం శ్రీనివాస అయ్యంగార్) గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

(గత సంచిక తరువాయి)

శ్రీ బాబు అవతార పరిసమాప్తి అనంతరం కూడా హెడ్మాస్టరుగారు శ్రీ బాబుకిచ్చిన మాట ప్రకారం, ఎంత శ్రమ అయినా, వయో భారం అధికమైనా, ఆరోగ్యం దెబ్బతిన్నా కూడా, దీక్షగా ప్రతిరోజు స్కూలుకు వచ్చి పని చేశారు. ఎప్పుడూ శ్రీ బాబు ఫోటో పైనే వారి దృష్టి నిలిచి ఉండేది. ఎవరైనా స్కూలు చూడటానికి వస్తే, వారికి శ్రీ బాబు ఫోటోను చూపిస్తూ "వీరు మా..." అని పరిచయం చేయబోయేసరికి, 'బాబు' అని కూడా అనలేక గొంతు పూడుకుని పోయి దు:ఖం పెల్లుబికి వచ్చేది. ఆపుకోలేక గబగబా బయటకి వెళ్ళిపోయి కన్నీరు



తుడుచుకొని తమ్ము తాము సంబాళించుకొని గాని రాలేకపోయే వారు. "బాబు" అనుకునే సరికే హృదయం అలా కరిగి కన్నీరై ప్రవహించటం ఎన్ని జన్మల అవినాభావమైన ఆత్మీయ బంధమో!

హెడ్మాస్టరుగారు 1996 డిశెంబరు చివరి వారంలో ఒకనాడు సాయంకాలం స్కూలు నుండి తిరిగి యింటికి వెళ్ళటానికి బయలుదేరి ఆశ్రమం దాటేసరికి , పూజ్యశ్రీ మాతాజీ కారులో గుంటూరు వెడుతూ, వారిని చూసి కారాపి, ఎక్కమన్నారు. హెడ్మాస్టరు గారు "అమ్మా! నేనా! తమ కారులోనా!" అన్నారు. శ్రీ మాతాజీ "ఇది శ్రీ బాబు కారు. ఇందులో ఆయన అను:గు బిడ్డలందరికీ ఎప్పుడూ చోటు ఉంటుంది. ఎక్కండి" అని వారిని కారెక్కించుకొని గుంటూరు తీసుకొని వెళ్ళారు.

కారులో వారితో మాట్లాడుతూ వెడుతున్నపుడు, అక్కడక్కడ చిరుగు పట్టిన వారి ఖాదీ దుస్తులను చూసి, వారి నిరాడంబరతకు చలించిపోయిన శ్రీ మాతాజీ, వారిని గుంటూరులో సరాసరి ఖాదీషాపుకు తీసికొని వెళ్ళారు. వారు వద్దంటున్నా వినక, ఖాదీ గుడ్డలను కొని యిచ్చి, "ఇది శ్రీ గురు ప్రసాదం. మీరు పాంటు చొక్కా కుట్టించుకుని ధరించండి" అన్నారు. భక్తితో తమ కళ్ళకద్దుకొని ఆ ప్రసాదమును స్వీకరించిన హెడ్మాస్టరుగారు, "తమరు నాపై వర్షించిన యీ ప్రేమ మాటలకందనిదమ్మా! ఇక వెళ్ళి వస్తాను" అన్నారు. కాని శ్రీ మాతాజీ హెడ్మాస్టరుగారిని వారింటి వరకు తీసికొని వెళ్ళారు. అప్పుడు హెడ్మాస్టరుగారు శ్రీ మాతాజీని ప్రార్థించి తమ యింటిలోనికి

ఆహ్వానించారు. ఇంటిలో హెడ్మాస్టరుగారు శ్రీ మాతాజీకి పాదప్రక్షాళన చేసుకొని ఆ దివ్య పాదతీర్థమును తమ శిరస్సుపై చల్లుకొని, యింటిలో అందరిపైన చల్లారు. తమ పెద్ద కోడలితో అమ్మ పాదములకు పారాణి పెట్టించారు. పుష్పాలతో పూజించారు. "అమ్మా! నా దైవము, నా గురువు, నా సర్వస్వము అయిన శ్రీ బాబు యీనాడు యీ బడుగు భక్తుని యింటికి వేంచేశారు. నా జన్మ ధన్యమైనది. ఈ దాసుడు చంద్రునికి ఒక నూలుపోగుగా సమర్పిస్తున్న యీ సేవను దయచేసి, కాదనక స్వీకరించండి" అని శ్రీ మాతాజీకి వస్త్రములు సమర్పించారు.

మరునాడు హెడ్మాస్టరుగారు స్కూలుకు వచ్చి, అక్కడ ఉన్న ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులందరికీ యీ సంగతి చెబుతూ ఆనందబాష్పాలతో "శ్రీ మాతాజీ యిలా నాపై పరమానుగ్రహాన్ని వర్షించారు" అని ఉప్పొంగిపోయారు. ఒకటవ తేదీన జీతం రాగానే ఆ బట్టలు కుట్టించుకొని ధరిస్తానని కూడా చెప్పారు. కాని జనవరి ఒకటవ తేదీనే ఆయన జబ్బు పడ్డారు.

సుస్తీగా ఉన్నా సరే, ఆశ్రమంలో జనవరి ఒకటవ తేదీన జరిగే పాదపూజకు వచ్చి తీర్థ ప్రసాదములు తీసుకుని వెడుతుండగానే వారికి తీవ్రమైన ఆయాసం వచ్చింది. ఇక స్కూలుకు రాలేనని గ్రహించి, హెడ్మాస్టరుగారు స్కూలు యాజమాన్యం వారికి ఒక ఉత్తరం వ్రాస్తూ "ఇక మీదట స్కూలుకు వచ్చి పని చేయగలుగుతాననే ఆశ కనిపించటం లేదు. తుదిశ్వాస వరకు స్కూలులో పని చేస్తానని నేను శ్రీ బాబుకిచ్చిన మాటను నిలబెట్టుకోలేనపుడు, ఇక నాకు జీవించి ఉండే హక్కు లేదు. నేను శ్రీ బాబు చరణ సన్నిధికి చేరుకుంటాను" అని వ్రాశారు.


ఆశ్రమం నుండి తమను చూడవచ్చిన వారందరికి వీడ్కోలు నమస్కారములు పలికి, అంత ఆయాసంలోను ప్రతి పైసతో సహా స్కూలు జమా ఖర్చులు అప్పగించి, వచ్చిన ప్రతివారిని ఫల పుష్పములతోను, స్త్రీలను పసుపు, కుంకుమ, వస్త్రములతోను సత్కరించి కన్నీటితో వీడ్కోలు పలికారు. అప్పటి నుండి శ్రీ బాబు ఫోటోను క్షణమైనా వదలకుండా గుండెలకు ఆనించుకొని, జనవరి 7వ తేదీన వేకువ జామున శ్రీ బాబు వైపు చూస్తూ వారిలోనే లయించిపోయారు.

పూజ్యశ్రీ మాతాజీ ఆ వార్త వినగానే ఎంతో ఖేదం పొందుతూ "హెడ్మాస్టరు గారికి అలా వస్త్రాలు యిచ్చి, వారి వద్ద నేను వస్త్రాలు తీసుకోవటం ద్వారా నేను వారికి వీడ్కోలు పలికినట్లైందేమో! అలా చేయకుండా ఉండి ఉంటే వారు మరికొంత కాలం మనతో ఉండేవారేమో!" అని కన్నీరు పెట్టుకున్నారు. హెడ్మాస్టరుగారు గానే వారు ఆశ్రమంలో అందరికి ఆత్మీయులైపోయారు.

ఆశ్రమ భక్తులెవరైనా తనువు చాలించినపుడు, ఉపనిషత్తులు, భగవద్గీత పారాయణ చేస్తూ, భగవన్నామ సంకీర్తనతో ఆశ్రమవాసులందరూ, స్కూలు ప్రక్కనే వున్న రుద్రభూమికి తీసుకొని వెళ్ళి అంత్యక్రియలు జరిపేవారు. అటువంటి దృశ్యం తన కంట పడినప్పుడల్లా, హెడ్మాస్టరుగారు కన్నీరు పెట్టుకుంటూ, "ఆహా! ఆ భక్తుడెంత ధన్యుడు! మన ఆశ్రమవాసులెంత పుణ్యాత్ములు! అటువంటి ఉత్తమమైన, దివ్యమైన వాతావరణంలో, పరమ పవిత్రమైన యీ సద్గురు క్షేత్రంలో లయించిపోయే ఆ భక్తుని భాగ్యం ఎంత అరుదైనది! నేను నా తనువు చాలించిననాడు, మీరందరూ ఎంతో దయగలవారై నాకు కూడా, యీ పుణ్యభూమిలోనే, యిటువంటి భగవత్స్మరణతోనే యిదే విధంగా లయించిపోయే సద్గతిని కలిగించి పుణ్యం కట్టుకోండి. అదొక్కటే నా చివరి కోరిక" అని ఎన్నోసార్లు తోటి ఉపాధ్యాయులతోను, ఆశ్రమ భక్తులతోను అన్నారు.

వారు యీ విషయాన్నే అనేక సందర్భాలలో వారి కుమారులతోను, బంధు మిత్రులతోను ప్రస్తావించి తమ ఏకైక అభిమతమును వెల్లడించారట. అందువలన గురుకుల ఉపాధ్యాయులు, ఆశ్రమ భక్తులు వారి నిర్యాణ వార్త విని గుంటూరు వెళ్ళి, హెడ్మాస్టరుగారి కోరికను వెల్లడించి, వారి పార్థివ దేహమును ఆశ్రమానికి తీసికొని రండని కోరగా, వారి కుమారులు, బంధువులు ముక్తకంఠంతో అంగీకరించి, వారందరూ ఆశ్రమానికి వచ్చారు. వారిలో కొందరు శిష్ట వైష్ణవ సంప్రదాయానుసారంగా యీ కార్యక్రమం జరగటం లేదని మొదట అనుకున్నా, ఆశ్రమానికి వచ్చిన తరువాత, యిక్కడ హెడ్మాస్టరుగారి పట్ల ఆశ్రమవాసులు చూపిన ఆదరాభిమానములను, భక్తి గౌరవములను, ఒక మహోన్నత ఆధ్యాత్మిక వైభవంతో వెలిగిపోతున్న దివ్య వాతావరణంలో వారు హెడ్మాస్టరుగారి పార్థివ దేహమును తరలించుకొని రుద్ర భూమికి తీసికొని వెళ్ళిన తీరును చూసి ముగ్ధులై పరవశించిపోయారు. "మేమందరమూ చేయగలిగినదానికంటె సహస్రాధిక వైభవంతో మీరు మా శ్రీనివాసుని ఆదరించి సాగనంపారు. ఆయన కృతార్థుడైనాడు. మీరందరూ మహాత్ములు. ఇదంతా చూడగలిగిన మేము ధన్యులము. మా శ్రీనివాసుని హృదయాన్నే గెలుచుకున్న శ్రీ బాబూజీ మహరాజ్ వారు సాక్షాత్తు శ్రీనివాసులే. వారికి మా భక్తి పూర్వక ప్రణామములు" అన్నారు.

**బద్ధేనాంజలినా । నతేన శిరసా । గాత్రైః స్సరోమోద్గమైః ।**
**కంఠేన స్వరగద్గదేన । నయనేనోద్గీర్ణ బాష్పాంబునా ।**
**నిత్యం త్వచ్చరణారవింద యుగళ ధ్యానామృతాస్వాదినాం ।**
**అస్మాకం సరసీరుహాక్ష సతతమ్ సంపద్యతాం జీవితం ॥** – ముకుందమాల





-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

# త్రైలింగ స్వామి

1699లో గణపతి స్వామి ప్రయాగ, ద్వారకలు దర్శించారు. ఆయన మహిమలను రామేశ్వరంలో చూసినవారు ఆయనను గుర్తించి ఆయనకు సేవలు చేశారు. గణపతి స్వామి "మీకు నేను ఏమి చేయాలి?" అని అడిగితే కొంతమంది ధనం, కొంతమంది వంశాభివృద్ధిని కోరారు. గణపతి స్వామి అనుగ్రహంతో ఒక సంవత్సరంలోనే ధనం కోరినవారు ధనవంతులయ్యారు, మరికొంత మందికి సంతానం కలిగింది. ఈ విషయం తెలిసి ఎందరెందరో తమ కోర్కెలను తీర్చుకోవటానికి గణపతి స్వామి వద్దకు రావటం మొదలు పెట్టారు. త్వరలో గణపతి స్వామిని సేవించే భక్తుల సంఖ్య దినదినాభివృద్ధి అయింది. అది స్వామివారి పారమార్థిక చింతనకు విఘ్నం రావటంతో రెండేళ్ళ తరవాత ఆ ప్రదేశం విడిచి 1701లో నేపాల్ చేరి అక్కడ యోగాభ్యాసం చేశారు. ఆయనలో అనేక శక్తులు ప్రకాశించాయి. ఆయన చూపే అసాధారణ మహిమలు జనబాహుళ్యంలో వ్యాపించాయి.



ఒకరోజు నేపాల్ మహారాజు సైన్యంతో అడవికి వేటకు వెళ్ళాడు. రాజుగారి సేనాపతి ఒక పెద్దపులిపై తుపాకి పేల్చాడు. అది తప్పించుకుని పరుగెత్తసాగింది. భటులు దానిని వెంబడించారు. ఆ పెద్దపులి గణపతి స్వామి ఉన్న చోటుకు చేరుకుని ఆర్తనాదం చేస్తూ స్వామి పాదాల వద్ద పడుకుంది. ఆ పులి చేసిన ఆర్తనాదానికి స్వామివారి ధ్యానం సడలింది. కళ్ళు తెరచి ఆ పులిని ఆప్యాయంగా నిమిరారు. ఇది చూసి రాజభటులు నిశ్చేష్టులైనారు. స్వామి రాజభటులను దగ్గరకు రమ్మన్నారు. వారు వచ్చి స్వామివారికి నమస్కరించారు. స్వామి వారిని చూసి "ఇందులో ఆశ్చర్యం ఏమీలేదు. మీరు కూడా మీ హింసా ప్రవృత్తిని విడిచి పెడితే క్రూర జంతువులుకూడా మిమ్ము హింసించవు" అన్నారు. స్వామివారి పాదధూళిని కళ్ళకు అద్దుకొని స్వామి అనుమతి తీసుకుని వెళ్ళిపోయారు. వారు చూసిన ఈ సన్నివేశాన్ని రాజుకు విన్నవించారు. రాజుగారు ధార్మిక బుద్ధి కలవాడు. స్వామివారి అలౌకిక శక్తిని దర్శించాలని రత్నరాశులను, వస్త్రాలను తీసుకుని వెళ్ళి స్వామికి సమర్పించారు. స్వామి ఆ రత్నరాసులను ముట్టలేదు. స్వామి రాజును సన్మానించి వివిధరకాల ఉపదేశాలు చేసి పంపారు.

ఇలాంటి కార్యకలాపాలతో స్వామి ఖ్యాతి సర్వత్రా వ్యాపించింది. స్వామి పారమార్థిక కార్యాలకు భంగం కలిగి స్వామివారు 1707లో నేపాలు వదలి 1710లో మానస సరోవరం చేరారు. మానస సరోవరంలో ఒక వితంతువు 7ఏళ్ళ మృత బాలుణ్ణి భుజాన వేసుకుని ఏడుస్తూ వెళ్తోంది. ఆమెకు ఏకైక ఆధారమైన తన పుత్రుడు పాము కాటుకు గురి అయి మరణించాడు. ఆ పిల్లవానికి అంతిమ సంస్కారం చేసే సమయానికి స్వామి అక్కడకు చేరుకొన్నారు. స్వామిని చూడగానే ఆమెలో ఏదో ఒక ఆశ అంకురించింది. తన కుమారుని స్వామి పాదాలపైన ఉంచి నమస్కరించింది. స్వామి ఆ పిల్లవానిని చేతితో స్పృశించారు. ఆశ్చర్యం! ఆ పిల్లవానిలో చలనం కలిగింది. పిల్లవాడు బ్రతికాడు. వాడి తల్లి ఆనంద పరవశ అయింది. మరుక్షణంలో స్వామి అదృశ్యమయ్యారు.

1726లో స్వామి నర్మదాతీరంలో మార్కండేయ ఆశ్రమానికి వచ్చి నివసించసాగారు. అక్కడ ఎందరో మహాత్ములను కలసి వారితో సంభాషించే అవకాశం కలిగింది. దానికి వారు సంతుష్టులయ్యారు. ఆ ఆశ్రమంలో ఖాకీ బాబా అనే మహాత్ముడు ఉండేవాడు. ఒకరోజున ఆయన నది ఒడ్డుకు వెళ్ళి చూశాడు. అతనికి నదిలో నీళ్ళు పాలవలే కనబడసాగాయి. ఆ పాలను గణపతి స్వామి త్రాగటం చూశాడు. తాను దోసిట్లో తీసుకుంటే అవి నీరుగా మారాయి. ఈ అద్భుతాన్ని ఆశ్రమంలో అందరికీ చెప్పాడు. వారు గణపతి స్వామిని గౌరవించసాగారు. మార్కండేయ ఆశ్రమాన్ని వదలి 1733లో ప్రయాగ చేరుకున్నారు. ఒక నిర్జన ప్రదేశంలో యోగ సాధన చేయసాగారు.

ఒకసారి గణపతి స్వామి ప్రయాగ ఘాట్‌లో కూర్చుని ఉండగా ఒక నావ యాత్రీకులను తీసుకుని వస్తోంది. ఆ నావ నది మధ్యలో ఉండగా తుఫాను గాలులు వీచాయి. పెద్దవాన మొదలయింది. అక్కడ వున్నవారంతా ప్రాణభీతితో పారిపోసాగారు. గణపతి స్వామి మాత్రం ఆ వానలో అట్లాగే కూర్చున్నారు. పారిపోతున్నవారిలో రామతారక భట్టాచార్య అనే బ్రాహ్మణుడు స్వామిని గుర్తించి వర్షంలో తడువవద్దని, తనతో రమ్మని ప్రార్థించాడు. స్వామి "బాబూ! నేను ఏమీ బాధ అనుభవించటంలేదు అదిగో చూడు, ఆ వస్తున్న నావ కాసేపట్లో నదిలో మునిగిపోబోతుంది అని అంటుండగానే ఆ నావ నదిలో మునిగిపోయింది. చూస్తూ ఉండగానే స్వామివారు అదృశ్యులయ్యారు. చూస్తూ ఉండగా మరుక్షణంలో నావ సురక్షితంగా ఒడ్డుకు చేరుకొంది.

- సశేషం

Printed & Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, 24-7-8, Sandeep Mansion, Jonnavittula Vari St.,Gandhi Nagar, Vijayawada-520003, N.T.R.Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## మార్చి 27న శ్రీ కాళీవనాశ్రమంలో జరిగిన శ్రీరామనవమి ఉత్సవ దృశ్యములు









ఏప్రియల్ 1న
శ్రీ కాళీవనాశ్రమం,
భీమవరం శాఖలో
జరిగిన
శ్రీరామనవమి
పూజ

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

## ఏప్రియల్ 21న శ్రీ శంకరజయంతి నాడు శ్రీకాళీవనాశ్రమంలో జరిగిన శ్రీ సద్గురు పాదపూజా దృశ్యములు







If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.